నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 4-4-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి:30 సంచిక:184 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

సృజన కర్త
ఉన్నచోటే ఉంటాడు
క్రేత పైపైకి.

మండె ఎండలు
కుండపోత వానలు
నీరైన మేఘం.

తూరుపు గాలి
సృజనకు నెలవు
దిశ మారిందా ?

బురద గుంట
అవినీతి జలగ
గుంట పూడ్చాలి.

విద్యా వికాసం
వికసిత భారతం
విద్య ఉచితం

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాలు

దేశంలో ఎటుచూసిన
నియంతృత్వ పోకడలే !
ప్రజాస్వామ్యం చచ్చినటు
కంటారా పీడకలలె !

అరాచకాలు మొదలవును
చెడ్డవారు గెలిస్తే !
ప్రజల శక్తి తెలుస్తుంది
కలిసికట్టు నడిస్తే !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

భారీ భూకంపం ధాటికి 700 మందికిపైగా గాయాలు.. ఏడుకు పెరిగిన మృతులు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:తైవాన్ రాజధాని తైపీని శక్తిమంతమైన భూకంపం వణికించిన విషయం తెలిసిందే. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో 7.5 తీవ్రతతో భూమి కంపించింది. 25 ఏండ్లలో తైవాన్‌ను తాకిన బలమైన భూకంపం ఇదే అని అధికారులు తెలిపారు. దీంతో అక్కడ భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ అందిన సమాచారం మేరకు ఈ భూకంపం ధాటికి 730 మంది గాయపడినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మరోవైపు మృతుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ ఘటనలో మరణించిన వారి సంఖ్య తాజాగా ఏడుకు పెరిగింది. భూకంపం తీవ్రత ఎక్కువగా ఉన్ననేపథ్యంలో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు అంచనా వేస్తున్నారు.

1999 తర్వాత అతిపెద్ద భూకంపం..

1999 తర్వాత తైవాన్‌ను ప్రభావితం చేసిన అతిపెద్ద భూకంపం ఇదేనని స్థానిక అధికారులు వెల్లడించారు. అప్పుడు నాంటౌ కౌంటీలో 7.2 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ భూకంపం ధాటికి సుమారుగా 2,500 మందికి పైగా మరణించారు. 1,300 మందికి పైగా గాయపడ్డారు. ఆ తర్వాత 25 ఏండ్లలో తైవాన్‌ను తాకిన బలమైన భూకంపం ఇదే అని అధికారులు తెలిపారు.

సునామీ హెచ్చరికలు

తైవాన్‌లో భూకంపంతో జపాన్ సహా మరికొన్ని దేశాల్లోని తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీచేశారు. జపాన్‌లోని దీవులకు సుమారు 3 మీటర్ల మేర సముద్ర అలలు ఎగిసిపడి సునామీ వచ్చే అవకాశం ఉందని వాతావరణ సంస్థ అంచనా వేసింది. దాదాపు 30 నిమిషాల తర్వాత సునామీ మొదటి అల ఇప్పటికే దక్షిణ దీవులైన మియాకో, యాయామా దీవుల తీరాలను తాకినట్లు జపాన్ పేర్కొంది. సునామీ వస్తున్నదని, అందరూ ఇండ్లు ఖాళీ చేయాలని జపనీస్ జాతీయ వార్తాసంస్థ ఎన్‌హెచ్‌కే ప్రసారం చేస్తున్నది. కాగా, తైవాన్‌లో భూకంపాలు తరచూ వస్తుంటాయి. 1996లో 7.6 తీవ్రతతో సంభవించిన భూకంపంలో 2400 మంది ప్రజలు మరణించారు. ఇక జపాన్‌లో ప్రతిఏటా సుమారు 1500 వరకూ భూకంపాలు

నామినేషన్ దాఖలు చేసిన మైసూర్ మహారాజు యదువీర్ కృష్ణదత్త

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:మైసూర్ రాజ కుటుంబానికి చెందిన యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్ బుధవారం మైసూర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. జేడీఎస్ నేత, మాజీ సీఎం కుమారస్వామి సహా పలువురు నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇక మైసూర్-కొడగు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎం. లక్ష్మణ్ నామినేషన్ దాఖలు చేశారు.

లక్ష్మణ్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సహా పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. ఇక అంతకు ముందు మాండ్య నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి ఎంపీ సుమలత అంబరీష్ బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించారు. దీంతో ఆమె రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, జేడీఎస్ కూటమికి సపోర్టు ఇవ్వనున్నట్లు చెప్పేశారు.

మాండ్యాను తాను విడిచిపెట్టడం లేదని, రాబోయే రోజుల్లో మీకోసం నేను పనిచేయడం చూస్తారని, బీజేపీలో చేరడానికి డిసైడ్ అయినట్లు సుమలత తెలిపారు. 2019 ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో కుమారస్వామి కుమారుడు నిఖిల్‌పై సుమలత విజయం సాధించిన విషయం తెలిసిందే. కేంద్రంలోని బీజేపీ సర్కారు మాండ్య లోక్‌సభ నియోజకవర్గానికి 4 వేల కోట్ల నిధుల్ని రిలీజ్ చేసినట్లు సుమలత వెల్లడించారు. కాగా, బీజేపీ నుంచి రాజ్యసభకు సుమలత వెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

కరువు కాంగ్రెస్ తెచ్చింది కాదు- ప్రకృతి వైపరీత్యంతోనే- పొన్నం ప్రభాకర్

కరీంనగర్, ఏప్రిల్ 3:రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యంతో కరువు వచ్చిందని, గత వర్షాకాలంలో ఆశించిన మేర వర్షాలు కురవక పోవడంతో ఈ వేసవిలో నీటి కొరత ఏర్పడిందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం చిగురుమామిడిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో బిఆర్ఎస్, కేంద్రంలో బిజెపి పార్టీలు మొన్నటి వరకు అధికారంలో ఉన్నాయని, నాడు గుర్తుకు రాని రైతులు నేడు పార్లమెంట్ ఎలక్షన్ల ఓట్ల కోసం రైతు దీక్ష పేరుతో బిజెపి, బిఆర్ఎస్ దొంగ దీక్షలు చేస్తున్నాయన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ 10 సంవత్సరాలు అధికారంలో ఉండి కూడా ఏనాడు ఒక రైతును పట్టించుకోలేదని, ఎండిన పంటలను పరిశీలించక పోవడంతో పాటు ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం అందించలేదన్నారు. ప్రకృతి వైపరీత్యంతో ఎండిన పంటలకు నష్టపరిహారనీ అందించడంలో కేంద్ర ప్రభుత్వం కూడా విఫలమైందన్నారు.

కరువు కాంగ్రెస్ తెచ్చింది కాదని.. ప్రకృతి వైపరీత్యమే కారణమన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రస్తుతం ఎంపీ బండి సంజయ్ మొన్నటి వరకు రాముని ఫోటోతో అక్షింతలతో రాజకీయం చేసి నేడు రైతుల వద్దకు వెళుతూ దొంగ దీక్షలు చేస్తూ ఓట్లు అడుగుతున్నాడన్నారు. ప్రకృతి వైపరీత్యం ఎండిన పంటలకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించే అవసరం ఉన్నా కూడా కేంద్ర ప్రభుత్వం ఒక రూపాయి కూడా తెలంగాణ ప్రభుత్వానికి ఇవ్వడం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించారో, రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి పార్టీని కూడా ఓడిస్తారన్నారన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తెలంగాణలో అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీల అమలు చేయడం జరిగిందని, ఎవరు కూడా అధైర్య పడవద్దని, ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ పార్టీలకు ఓటేస్తే గులాం గిరే-హరీష్ రావు ఘాటు వ్యాఖ్యాలు

హైదరాబాద్, ఏప్రిల్ 3:భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్ గాంధీ సంతకాన్ని ఫోర్జరీ చేశారని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. యాదాద్రి జిల్లా బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీనీ వీడి కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగనున్న అభ్యర్థులు మూడవ స్థానానికే పరిమితం అవుతారన్నారు.

భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్ గాంధీ సంతకాన్ని ఫోర్జరీ చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తేనే కాంగ్రెస్ కు ఓటు వేయండని తెలిపారు. హామీలు అమలు కాకపోతే బీఆర్ఎస్ కు ఓటేయండి అన్నారు.

కాంగ్రెస్ హామీలు అమలు జరగాలంటే బీఆర్ఎస్ గెలవాల్సిందే అన్నారు. ఇచ్చిన హామీల అమలుపై మంత్రులు బహిరంగ చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో లీకేజీలు ఇస్తూ పాలన చేస్తున్నారన్నారు. కేసిఆర్ పర్యటన తర్వాతే నాగార్జునసాగర్ ఎడమ కాలువకు కరీంనగర్ వరద కాలువకు నీటి విడుదల జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తికాగానే కరెంటు, నీటి బిల్లులు పెంచుతారన్నారు. బీజేపీ పాలనలో అన్ని వర్గాలు దగాపడ్డాయన్నారు. జాతీయ పార్టీలు గెలిస్తే ఢిల్లీకి గులాంగిరి చేస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ 5 సంవత్సరాల కంటే ఎక్కువ ఎప్పుడూ అధికారంలో లేదన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆ పార్టీ గ్రూపు తగాదాలే పడగొడతాయని తెలిపారు. ఉద్యమం సమయంలోను బీఆర్ఎస్ పార్టీపై బురద చల్లారని, పైరవీకారులు, కాంట్రాక్టర్ లు పార్టీని విడిచిపోతున్నారన్నారు.

పార్టీని విడిచి పోయిన వారిని కాళ్ళు మొక్కినా తిరిగి చేర్చుకోమన్నారు. బీజేపీ నుండి నలుగురు ఎంపీలను గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రానికి ఏం తెచ్చారని ప్రశ్నించారు. కార్యకర్త లకు తెలంగాణ భవన్ లో లీగల్ టీమ్, ముఖ్య నేతలు అందుబాటులో ఉంటారన్నారు. పోలీస్ అధికారులు వ్యవహరిస్తున్న తీరను బీఆర్ఎస్ పార్టీ గమనిస్తుంది.. త్వరలోనే అవకాశం వస్తుంది గట్టిగా సమాధానం చెప్తామన్నారు.

పెద్దపల్లిలో వంశీని భారీ మెజార్టీతో గెలిపిస్తాం- మంత్రి శ్రీధర్ బాబు

కరీంనగర్, ఏప్రిల్ 3:రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలియజేశారు. బుధవారం హైదరాబాద్ లోని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నివాసంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం పార్లమెంట్ ఇంచార్జ్, రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సమక్షంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ? రాబోయే ఎన్నికల్లో గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారని, వంశీ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు.

కాంగ్రెస్ శ్రేణులంతా వంశీ గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. మీడియా సమావేశంలో పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలు విజయ రమణారావు, ప్రేమ్ సాగర్ రావు, మక్కాన్సింగ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గడ్డం వినోద్, గడ్డం వివేక్ లతోపాటు కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు.

వయనాడ్ నుంచి నామినేషన్ దాఖలు చేసిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ వయనాడ్ ఎంపీ నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. 2019 ఎన్నికల్లో వయనాడ్ నుంచి రాహుల్ గాంధీ ఎంపీగా గెలుపొందిన సంగతి తెలిసిందే. ప్రతిసారీ అభ్యర్థిని మార్చుతూ వచ్చిన సీపీఐ ఈసారి ఏకంగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా సతీమణి 'అన్నీరాజా'ను బరిలోకి దించింది. బీజేపీ తరఫున ఆ పార్టీ కేరళ అధ్యక్షుడు కే సురేంద్రన్ పోటీ చేస్తున్నారు.

గత సార్వత్రిక ఎన్నికల్లో 4.31 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందిన ఈ నియోజకవర్గం నుంచే ఈసారి మళ్లీ పోటీ చేస్తున్నారు రాహుల్ గాంధీ. వయనాడ్ ఎంపీ నియోజకవర్గానికి రెండవ విడతలో భాగంగా ఏప్రిల్ 26న పోలింగ్ జరగనుంది.

ఎల్లమ్మ తల్లి ఉత్సవాల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి పి వెంకట్రామారెడ్డి

మెదక్, ఏప్రిల్ 3:ఎల్లమ్మ తల్లి సల్లంగా చూడాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ ఎంపీ అభ్యర్థి, మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ పి వెంకట్రామారెడ్డి లు వేడుకున్నారు. మండలంలోని ఎల్లారెడ్డి పేటలో జరుగుతున్న ఎల్లమ్మ తల్లి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మా మీ చల్లని చూపులు తెలంగాణ మీద ఉండాలని, ఎంపీగా ఘన విజయం అందించాలని ఎల్లమ్మ తల్లిని వేడుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నరేందర్ గౌడ్, వెంకట్ గౌడ్, ఎల్లగౌడ్ వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, ఎంపీటీసీ వెల్పుల స్వామి, కో అప్షన్ సభ్యులు ఎండీ కలీమోద్దీన్, నాయకులు సిరినేని గోవర్ధన్ రెడ్డి, చిలువేరి మల్లారెడ్డి, బక్క కనకయ్య, బీమాసేన, ఇప్ప దయాకర్ భాస్కర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

జీవీఆర్ ఆత్మీయ పురస్కారాలు ప్రదానం..

పురస్కార గ్రహీతలతో డా॥ కె.వి.రమణాచారి తదితరులు.

హైదరాబాద్, ఏప్రిల్ 3 (నేటినిజం ప్రతినిధి): జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుదిబండి వెంకటరెడ్డి 83వ పుట్టిన రోజు వేడుకలు త్యాగరాయ గానసభలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పోస్టుకార్డు కథల పోటీ విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. దారం గంగాదర్, కోట్ల వనజలత, డా॥ ఎం.సుగుణారావు, శైలజామిత్ర, సీఎన్ చంద్రశేఖర్‌లకు బహుమతులను ప్రదానం చేశారు. డా॥ కె.వి. రమణాచారి, రిటైర్డ్ ఐఏఎస్, పి. రామకృష్ణ, డా॥ చిల్లా రాజశేఖర్‌రెడ్డి, లంక లక్ష్మీనారాయణ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవీఆర్ ఆత్మీయ పురస్కారాలను అందుకున్నవారు- రామరాజు లక్ష్మి శ్రీనివాస్, వీవీ. రాఘవరెడ్డి, మౌనశ్రీ మల్లిక్, డి. తిరుమలేశ్వర రావు, సీహెచ్. రాగిణి, డా॥కే. నిర్మలా విశ్వేశ్వరరావు, డా॥జి. అవర్ణప్రసాద్ అందుకున్నారు. డా॥కే.నిర్మలా విశ్వేశ్వరరావు, బేబి శేషభట్టార్ ఆరోహ శరణ్యల సంప్రదాయ నృత్యాలు అలరించాయి. సంస్థ ప్రధాన కార్యదర్శి వీవీ. రాఘవరెడ్డి ఆనంద నిలయానికి రూ. 50 వేలు విరాళాన్ని ప్రకటించి డా॥ కే.వి. రమణాచారికి అందజేశారు. పొత్తూరి సుబ్బారావు, టీవీ. శిరిష, డా॥ ఐశ్వర్య, వి. శైలజ, కే. విజయలక్ష్మి, గిడుగు కాంతికృష్ణ, కొండపాక కృష్ణమాచార్య, డా॥రామరాజు శ్రీనివాసరావులు అతిథులుగా పాల్గొన్నారు.

మందుపాతరలు మారణహోమ కేంద్రాలు !

దేశ సరిహద్దుల్లో శత్రు సైన్యం, చొరబాటు దారులు, ఉగ్రవాదుల చొరబాట్లను నిరోధించడానికి రక్షణశాఖ వినియోగించే విచక్షణా రహిత, ప్రమాదకర, ప్రాణాంతక ఆయుధాలుగా మందుపాతరలకు పేరుంది. మందుపాతరల విధ్వంసానికి శత్రువులు మాత్రమే కాకుండా సామాన్య అమాయక ప్రజలు, సైనికులు కూడా ప్రాణాలు కోల్పోవడం, గాయపడడం, జీవనోపాధులను కోల్పోవడం అనాదిగా జరుగుతున్నది. గత రెండు దశాబ్దాలుగా "యూఎన్ మైన్స్ ఆక్షన్ సర్వీసెస్"విభాగం సామాన్య ప్రజలకు, పీస్‌కీపర్స్, హెల్పర్స్, గాయపడిన అభాగ్యులకు అవగాహనతో పాటు సహాయాన్ని అందజేస్తున్నది. మందుపాతరల భయంకర విధ్వంసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు గాయపడిన లేదా చనిపోయిన కుటుంబాలకు చేయూతను ఇవ్వడాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో 2005లో ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానించి ప్రతి ఏట 04 ఏప్రిల్‌న ప్రపంచవ్యాప్తంగా "అంతర్జాతీయ మందుపాతరల అవగాహన దినం లేదా ఇంటర్నేషనల్ డే ఆఫ్ మైన్ అవేర్‌నెస్"ను పాటించుట ఆనవాయితీ గామారింది. ఈ ఏడాది అంతర్జాతీయ మందుపాతరల అవగాహన దినం-2024 నినాదంగా "ప్రొటెక్టింగ్ లైవ్స్, బిల్డింగ్ పీస్" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు.

కాలు మోపలేక, జీవనోపాధులు సాగని సరిహద్దు గ్రామాలు:

యుద్ధ సమయాల్లో పాతిన మందుపాతరల వల్ల అక్కడి ప్రజలు కాలు మోపలేక, జీవనోపాధ సాగించలేక నరకయాతన పడుతున్నారు. ముఖ్యంగా దేశ సరిహద్దులు, ప్రచ్ఛన్న యుద్ధ సమయాల్లో ఆయా దేశాల సైనికులు శత్రుమూకలను మట్టుపెట్టడానికి మందుపాతరలు అమర్చడం దశాబ్దాలుగా కొనసాగుతున్నది.

అవసరం లేని మందుపాతరలను తొలగించడం, గాయపడిన/ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు చేయూత ఇవ్వడం, సామావడన్య పౌరసమాజానికి మందుపాతరల పట్ల అవగాహన కల్పించడం లాంటి చర్యలు చేపట్టడం జరుగుతున్నది. మందుపాతరల పాతిన ప్రదేశాలు వ్యవసాయానికి, ఆవాసాలు ఏర్పరచుకోవడానికి, జీవనోపాధులు సాగించడానికి వీలు కాదని మనకు తెలుసు. ఆ ప్రదేశాల ప్రజలు/పిల్లలు కాలు కదపడానికి, నేలను వినియోగించుకోవడానికి భయపడుతుంటారు.

మందుపాతరలు అత్యధికంగా వినియోగిస్తున్న దేశాలు:

ప్రపంచవ్యాప్తంగా 61 దేశాలు మందుపాతరలను వినియోగిస్తూ ఆయా ప్రదేశాల ప్రజల జీవితాలను, జీవనోపాధులను ప్రభావితం చేస్తున్నారు. 2016లో మందుపాతరల పేలిన ఘటనల్లో 8,600 మంది ప్రాణాలు కోల్పోవడం, వేల మంది గాయపడడం నమోదు అయ్యింది. మందుపాతరలు అత్యధికంగా వినియోగించే దేశాల జాబితాలో ఈజిప్ట్, అఫ్ఘానిస్థాన్, సిరియా, అంగోల, కాంబోడియా, ఇరాక్, సోమాలియా, బోస్నియా, ఇథియోపియా, లిబియా, మొదాంబిక్, సూడాన్, ఇజ్రాయిల్, మయాన్మార్, రష్యా, బ్రెజిల్, ఉక్రెయిన్, కొలంబియా, కాంగో, యూకె, సౌథ్ ఆఫ్రికా, యూఎస్‌లు ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయ భూముల రక్షణ, ఆవాసాల శాంతి, అభివృద్ధి బాటన నడవడం, ప్రాణాలు కోల్పోయిన/గాయపడిన కుటుంబాలకు చేయూత ఇవ్వడం, ప్రజలను రక్షించుకోవడం లాంటి చర్యలను తీసుకుంటూ మందుపాతరల విధ్వంసాన్ని పరిమితం చేద్దాం, ప్రజల ప్రాణాలను కాపాడుకుందాం.

(04 ఏప్రిల్ "అంతర్జాతీయ మందుపాతరల అవగాహన దినం" సందర్భంగా)

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

చురక

వికసించని అభివృద్ధిని
విస్తృతంగా చెప్పేస్తరు
అరచేతిలో వైకుంఠం
అద్భుతంగా చూపిస్తరు
ఇంద్రజాల ప్రదర్శన
ఇదే నేడు దేశమంత
ఎన్నికల్లో గెలిపిస్తే
ఎడారే ఇక బ్రతుకంతా

–వేల్పుల నారాయణ
9440433475

నేటి కందం– నేటికి అందం

మునుకొని జపనీయులు–ధీ
కొనగా ధైర్యమ్ముతోడ కుమ్ముచు జయకే
తనమును కరమున దాల్చిరి
మనవారలు గెలిచి కోహిమా యుద్ధములోన్

(4-4-1944 భారత్ పై జపాన్ దుశ్చర్యగా కోహిమా యుద్ధం ప్రారంభం)

–రాధశ్రీ
సెల్:9494481210

సాహితీ కిరణం ఆహ్వానము

శ్రీ క్రోధి నామ సంవత్సర 'ఉగాది సంబరాలు'
కవిసమ్మేళనం, పురస్కారాల ప్రదానం
కవితల, కథల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం
శ్రీమతి కె.వి.ఎన్.ఎల్.ప్రసన్న కుమారి రచించిన 'సాహితి సకలం'
(నవిధ సాహితీప్రక్రియల సమాహారం)పుస్తకావిష్కరణ.

ముఖ్యఅతిథి : శ్రీ కె.యస్..లక్ష్మణరావు, ఆం.ప్ర. శాసనమండలి సభ్యులు
సభాధ్యక్షులు : శ్రీ బైసదేవదాస్ ,సంపాదకులు - నేటినిజం దినపత్రిక
గౌరవ అతిథి : శ్రీ గుదిబండి వెంకటరెడ్డి ,గౌరవ సంపాదకులు సాహితీకిరణం
విశిష్ట అతిథిలు : శ్రీ విడరల సాంబశివరావు, అధ్యక్షులు .విదదలనీహారిక ఫౌండేషన్
శ్రీ వి.వి.రాఘవరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ కార్తీక డెవలపర్స్
సభాప్రారంభం : శ్రీ పొత్తూరి సుబ్బారావు ,సంపాదకులు, సాహితీకిరణం
ఆత్మీయ అతిథులు : శ్రీ తూములూరి రాజేంద్రప్రసాద్, సలహాదారులు సాహితీకిరణం
శ్రీ మౌనశ్రీ మల్లిక్, సినీగేయరచయిత
శ్రీ వడవలి రాధాకృష్ణ ,కథారచయిత
కథల విశ్లేషణ : శ్రీ తంగిరాల చక్రవర్తి ,రచయిత, విమర్శకులు
కవిసమ్మేళనం & సభా నిర్వహణ శ్రీ పెద్దూరి వెంకటదాసు ,సలహాదారులు, సాహితీకిరణం
పుస్తక సమీక్షకులు శ్రీమతి పొత్తూరి జయలక్ష్మి , సాహితీకిరణం మేనేజర్
కృతి స్వీకర్త : శ్రీకె.వి.యన్.ఎస్.వి.ప్రసాద్ ,సాహిత్యాంజలిలోష
శుభాకాంక్షలు : శ్రీ సయ్యద్ జానీబాషా ,కవి,రచయిత

తేది:13.04.2024 శనివారం ఉదయం 10.30 గంటలకు
వేదిక: సాహితీకిరణం బ్రాంచి కార్యాలయం (ఇం.నెం.107-1-331, వార్డ్ సచివాలయం ఎదురుగా) పొత్తూరు, గుంటూరు
సాహితీకిరణం సంపాదకవర్గం, సిబ్బంది

నేటినిజం
సాహితీ కెరటాలు
website:www.netinijam.com
website: www.netinijam.com

బుడ్డ పర్న



కరచాలనం
కలయిన ఉత్తదే
హృదయాలు కలిస్తేనే
సోపతి.



-అన్నవరం దేవేందర్
9440763479

అద్దంలో ముఖం చూసుకున్నప్పుడు

-విద్యాసాగర్ అంగలకుర్తి
96760 01230

నేను నేనుగా ఉన్నప్పుడు
నాకేమీ అక్కరలేదనిపిస్తుంది.
నేనింకొకరిలా ఉండాలనుకోగానే
ఇంకేదో కావాలనిపిస్తుంది.-

ఏవేవో పుస్తకాలు కొంటాను నేను
అవన్నీ పూర్తిగా చదువుతానా ?
అద్దంలో మొహం చూసుకున్నప్పుడు
గుర్తొచ్చే జ్ఞాపకాల్లా
నా మనసు శకలాలకు అవి అద్దాలు.
పూర్తిగా చదివితే
అవి నన్ను నన్నుగా ఉండనివవు .
వర్తమానాన్ని తోసిరాజనే జ్ఞాపకాల్లా !-

తలుపు తోసుకొని
వెళ్ళమని అంటూనే
విశ్వం ప్రపంచంలో
నా చోటేదో చూసిపెట్టేసింది .
నాలాగా ఉండడమంటే ఆ చోటువైపు
సాగిపోతూ ఉండడమే !
చేరుకుంటానా లేదానేది
అసలు విషయమే కానే కాదు
ప్రయాణమే నన్ను నన్నుగా ఉంచేది-

శూన్యంలో ఏదో
సూదంటు రాయి ఉంటుందని
నేను నమ్మను.
నా మనసులో మాటను
తనవైపు లోక్కోగలదని కూడా
నేనను కోను.
మాటలే అర్థం కాని లోకంలో
మునకేసి అంచు తాకే అవకాశం
మౌనానికి దొరుకుతుందా ?
విప్పి చెబితేనే
వినిపించుకోని వాళ్ళ ముందు
కప్పి చేబితే క్యా ఫాయిదా?-

జీవితం వెదుకులాట కాదు
తీరని అన్వేషణ కాదు
అనంతం కోసం కాదు
అసలు నిజం కోసం కాదు
అవేవీ నన్ను లొంగదీయలేని
స్వేచ్ఛ కోసం.

ఉగాది

- ప్రొఫెసర్
ఎస్వీ సత్యనారాయణ
సెల్:9618032390

వికసించిన మామిడిచెట్టు
పూత నీ ఊహ
ఆమని అరుదెంచిందనే
ఆలోచన నీ కవితా ధార-
కవీ! జీవితం ఊహకాదు వాస్తవం
సాహిత్యం సమాజ చలనాలకు
ప్రతిరూపం

ప్రపంచీకరణ భూతం
మన జీవన మూలాలనూ
మూల్యాలనూ కుదిపేస్తుంటే
ఇక వర్ణనలూ, ఉపమానాలూ
పదచిత్రాలు, ఉద్వేగాలూ
అనుభూతులూ, అభివ్యక్తులూ
అన్నీ మారాల్సిందే
యధార్థ అనుభవాలను రాయాల్సిందే-
మన ఇష్టాయిష్టాలతో
ప్రమేయం లేకుండా
పరిణామం అనివార్యమే!
ప్రగతిశీలమా? కాదా? అన్నది
అంచనా కట్టాల్సిందే-

రియలెస్టేట్ కట్టడాల చెదలు
చెట్లను తినేస్తున్నాయి
విస్తరించే పట్టణాల మొసళ్ళు
పల్లెటూళ్ళను మింగేస్తున్నాయి-

ఇంకెక్కడి కోడి కూతలు?
ఎక్కడున్నాయ్ కోకిల పాటలు?
మావి పూతలున్నాయా?
వేప పువ్వులున్నాయా?
ఆమని అరుదెంచినట్టి
అనవాళ్ళు కనబడుతున్నాయా?

ప్లాస్టిక్ తోరణాలే కదా
పండుగ స్పెషల్‌గా వేలాడుతున్నాయి!
మార్కెట్ మావిడాకులే కదా!
వసంతాన్ని గుర్తుచేస్తున్నాయి!

ఉగాది పచ్చడి ప్యాకెట్లు కూడా
బహుళజాతి కంపెనీలే కదా
సరఫరా చేస్తున్నాయి
కోయిల పాటల్ని కూడా
సెల్‌ఫోన్ సంగీతాలే
రింగ్‌టోన్‌లుగా వినిపిస్తున్నాయి
వడ్లూ.. గోధుమలూ.. జొన్నలు
పండించే రైతులు
వలసకూలీలై పట్టణాలకు
తరలిపోయాక
బొబ్బట్లు.. పెసరట్లు.. జొన్నరొట్టెల
కోసం
హైపర్ మార్కెట్లకు వెళ్లాల్సిందే
పండగ సంబరం చవిచూడాలంటే
శిల్పారామం బాట పట్టాల్సిందే-

గుంపురావం

పిలుపులకే
పరిమితమైతే ఎలా
తలుపులు
తెరవాలి కదా.

చిన్నారులకు
గంజాయి ఉచ్చు
చాక్లెట్లు రూపంలో
చిచ్చు.

నాలుకకు విశ్రాంతి
దొరకనివ్వు
మనసులో ప్రశాంతత
ఉరకనివ్వు.

లేమిలో
సహనం సంధించు
కలిమిలో
సమన్వయం సాధించు.

పెదవులలోపలి
పదం నీది
పెదవులు దాటితే
ప్రపంచానిది

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

మానవతావాది వీ.పీ. చందన్‌రావు

'చందనాగ్ని' ఆవిష్కరణ సభలో తిరుమల శ్రీనివాస్ ఆర్య, కందాళై రాఘవాచార్య, వి.పి. చందన్‌రావు, బైస దేవదాసు, డా॥ నాళేశ్వరం శంకరం, ఘనపురం దేవేందర్, పంచరెడ్డి లక్ష్మణ్,

వి.పి. చందన్‌రావు కవిత్వంలో మానవతావాదం తొణికిసలాడుతుందని అందుకే అతని కవిత్వ సాఫల్యం దిశగా సాగిందని సీనియర్ జర్నలిస్టు, సంపాదకులు బైస దేవదాసు అన్నారు. శుక్రవారం హరిచరణ్ మార్వాడి డిగ్రీ కళాశాలలో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ కవి, వ్యాఖ్యాత వి.పి.చందన్‌రావు రచించిన చందనాగ్ని కవితా సంపుటి ఆవిష్కరణ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కవిత్వం జన్మతః వచ్చినా అధ్యయనంతో శిఖరాగ్రాలకు చేరుకుంటుందని సమాజానికి దారి చూపుతుందని, కవులతో సంచారం వలన, వారితో స్నేహంగా మెలగడం వలన ధైర్యం, అనుశీలనాశక్తి పెరుగుతాయని తన జీవితంలో ప్రభావం చూపిన వారిలో అలిశెట్టి ప్రభాకర్ తర్వాత విపి చందన్‌రావు అని ఆయన కవిత్వం సహజత్వంతో చమత్కారంతో మానవతా వాదంతో పాఠకులను ఆకట్టుకుంటాయని తెలిపారు. 50 ఏళ్ల సాహిత్య జీవితంలో విపి. చందన్‌రావు సృజించిన సాహిత్యమంతా ముందు తరం కవులకు సాహిత్యాభిమానులకు ఆదర్శంగా నిలుస్తుందని అభినందించారు. నిజామాబాద్ జిల్లా సాహిత్యాన్ని, సాహిత్య గౌరవాన్ని ఇనుమడింపజేసిన వారిలో వి.పి.చందన్‌రావు అగ్రగణ్యులని అన్నారు.

పుస్తకం అచ్చువేస్తేనే కవికి గుర్తింపు వస్తుందని ఎంత నిజమో, అర్థమయ్యే కవిత్వం, అర్థవంతమైన కవిత్వం రాస్తేనే కవికి గుర్తింపు వస్తుందనేది అంత నిజం. ఎన్ని పుస్తకాలు వేశామని కాదు ప్రజలను ఆకట్టుకుని ఆలోచింపజేసే కవిత్వం మనగలుగుతుందని అన్నారు. డా॥నాళేశ్వరం శంకరం 'దూదిమేడ', కందాళై రాఘవాచార్య 'ఏకధార' పంచరెడ్డి లక్ష్మణ్, "ఇసిత్రం", బైస రామదాసు బెడిద రాజేశ్వర్ కలిసి 'రేపు' కవితా సంకలనం, టేక్‌మల్ లక్ష్మణ్ ఇలా ఒక్క పుస్తకమే వేసినా ఆలోచింపజేసే కవిత్వం రాశారని అన్నారు. 70 యేళ్ళ చందన్‌రావు ఎంతో మంది మిత్రుల సలహాకు ఈ రోజు తాను కూడా "చందనాగ్ని" పుస్తకం వెలువరించడం ఆనందంగా వుందని అభినందించారు.

సభలో కీలక ప్రసంగం చేసిన తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ చందనాగ్ని చందన్‌రావు జీవితకాల సాఫల్యం అని, తన ఇంటికి సాక్షాత్తు జ్ఞానపీఠ అవార్డు గ్రహిత డాక్టర్ సి. నారాయణరెడ్డిని రప్పించుకున్న ఘనత ఆయనదని వివరించారు.

ఈ పుస్తకంలోని 171 కవితలు వేదికవే ప్రత్యేకతలతో చదువరులను ఆనందింపచేస్తాయని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన హరిదా రచయితల సంఘం అధ్యక్షులు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ విపి చందన్‌రావు తాను ఎన్నుకున్న రెండు మార్గాలలో విజేతగా నిలిచాడని, వ్యాఖ్యానంలో సభా సామ్రాట్‌గా విజయకేతనం ఎగిరేసాడని, కవిత్వంలో ఎన్నో హృదయాలను స్పందింప చేశాడని పరవశింపచేశాడని సవ్యసాచిగా నిలిచాడని కొనియాడారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి పి. సరోజినీ దేవి మాట్లాడుతూ అలతి అలతి పదాలతో అద్భుతమైన కవిత్వం రాయడంలో వి.పి. చందన్‌రావు సిద్ధహస్తుడని అభినందించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న ఇసిత్రం ఫేమ్ పంచరెడ్డి లక్ష్మణ్ మాట్లాడుతూ కేశవకుర్తి వీరభద్రా చారి ఆశయాలకు అనుగుణంగా చందన్‌రావు సాహిత్య రంగంలో ఎదిగాడని వివరించారు. మరో గౌరవ అతిథి ప్రముఖ కవి కందాళై రాఘవాచార్య మాట్లాడుతూ డాక్టర్ సి. నారాయణరెడ్డి అభిమానాన్ని అందుకున్న చందన్‌రావును ఆయన **"చందనా నా హృదయ నందనా"** అని అప్యాయతను పంచిన సందర్భాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెరసం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, తిరుమల శ్రీనివాస్ ఆర్య, గంట్యాల ప్రసాద్, డాక్టర్ కాసర్ల నరేష్‌రావు, డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, డాక్టర్ పి. రామ్మోహన్రావు, డాక్టర్ గణపతి అశోక్ శర్మ, టి. రేణుక, బైస వీణ, వసంత లక్ష్మణ్, పద్మావతి, సమత, బైస హరిదాస్, మధుసూదన్, ఉదయ్, ఆర్. మధు, తల్లావజ్జల మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం హరిదా రచయితల సంఘం పక్షాన వి.పి.చందన్‌రావును ఘనంగా సన్మానించారు.

వి.పి. చందన్‌రావును సత్కరిస్తున్న అతిథులు.



వి.పి. చందన్‌రావుకు ప్రశంసా పత్రాన్ని అందజేసి సత్కరిస్తున్న డా॥ కాసర్ల నరేష్‌రావు, బైస దేవదాసు, పంచరెడ్డి లక్ష్మణ్.

పుస్తక సమీక్ష

'ఇస్తారీ' నుండి 'నిఖిలేశ్వర్' దాకా..నిఖిలలోక పయనం



-రమణ వెలమకన్ని
సెల్:98660 15040

ప్రముఖ కవి, విమర్శకుడు, గొప్పవక్త, అనువాదకుడు, చిత్రకారుడు, నటుడు అయిన నిఖిలేశ్వర్ 'నిఖిల లోకం' పేరిట తన ఆత్మకథను వెలువ రించారు. ఒకటీ... రెండు కాదు ఆరు దశాబ్దాల తన సాహిత్య ప్రస్థానాన్ని రికార్డు చేసి మన ముందుంచారు.

'స్వీయ చరిత్ర' అనేది ఒక విశిష్టమైన ప్రక్రియ. జీవన వాస్తవికతకు దర్పణం పట్టే స్వీయ చరిత్రలో రచయిత జీవితంలోని ధర్మాధర్మాలు, సత్యా సత్యాలు, సుఃఖదుఖాలు, వెలుగునీడలు, తీపిచేదులు పాఠకుడికి తెలిసివస్తాయి. జీవిత సత్యాలను ఆవిష్కరించగల స్వీయ చరిత్రలో కల్పనలు వుండవు. మరో విధంగా మానవ ప్రవృత్తిని ప్రతిబింబిస్తుంది. స్వీయ చరిత్రలోని వ్యక్తి ఆదర్శ ప్రవర్తనలను అనుసరించడానికి, వారి నుండి స్ఫూర్తి పొందడానికి వీలౌ తుంది. నిఖిలేశ్వర్ పేరు చెప్పగానే దిగంబర కవి స్ఫురిస్తాడు. ఆజానుబా హుడైన ఆయన రూపం సాక్షాత్కరి స్తుంది. వినమ్రత, సాత్వికత మూర్తీభవించిన ఆయన వ్యక్తిత్వం తళుక్కుమంటుంది.

85 సం॥ల విజ్ఞాన ఖని నిఖిలేశ్వర్ "ఉద్యమ రీత్యా, సాహిత్య పరంగా నా జీవిత చరిత్ర ఎవరికి ఉపయోగం? స్వీయ చరిత్ర రాయడ మంటే సొంత బాకా ఊదుకోవడం కాదా?" అంటు ప్రారంభిస్తారు. అందుకే ఈ గ్రంథంలో ఆత్మస్తుతి వుండదు. అతిశయోక్తులు వుండవు. సాధించిన విజయాలను గొప్ప చేసి చూపించడం వుండదు. ఒక సామా న్యుడి జీవిత చరిత్రను అధ్యయనం చేసిన Feeling కలుగుతుంది. ఒక అసామాన్య ప్రతిభావంతుడు యింత నిరాడంబరంగా, ధైర్యంగా, నిజాయి తీగా తనను తాను ఆవిష్కరించుకొనే అద్భుతాన్ని గమనిస్తాం.

నిఖిలేశ్వర్ ఉరఫ్ యాదవరెడ్డి ఉరఫ్ ఇస్తారయ్య బాల్యంలోకి ఒకసారి తొంగిచూద్దాం. కుంభం నరసయ్య, నర్సమ్మ దంపతులకు నల్లగొండ జిల్లా వీరెల్లి గ్రామంలో మన కథా నాయకుడి జననం. నర్సమ్మకు ఇద్దరు పిల్లలు పురిట్లోనే చనిపోయిన కారణంగా, మూడవ కాన్పులో జన్మించిన బాలుడ్ని ఆ ఊరి నమ్మకం ప్రకారం ఓ కోమటి షావుకారి ఎంగిలి విస్తరాకుల పెంట మీద పడుకోబెట్టి 'ఇస్తారీ" అని పిలుచుకుంటారు. ఆ 'ఇస్తారీ' జన్మనామమే యాదవరెడ్డి. ఆ బాలుడే సాహిత్య లోకంలో 'నిఖిలేశ్వర్' గా ప్రసిద్ధిపొందిన ప్రతిభావంతుడు. 12 నెలల వయస్సులోనే తండ్రిని పోగొట్టుకున్న దురదృష్టవంతుడు. నిరక్షరాస్యురాలైన కుంభం నర్సమ్మ, కొడుకుని అక్కున జేర్చుకుని బ్రతుకు తెరువు కోసం పల్లెను వదిలి భాగ్యనగరానికి చేరుకుని మార్వాడి ఇళ్ళల్లో పసిపిల్లలకు పాలిచ్చే కొలువుజేస్తు, తీరిక సమయాల్లో కోఠీ సుల్తాన్ బజార్‌లో తమల పాకులు అమ్ముతూ చివరకు విఎస్‌టి సిగరెట్ ఫ్యాక్టరీలో కార్మికురాలిగా స్థిరపడి తన పేరు రాయడం నేర్చుకుంది. అదీ సంతకం పెట్టడం కోసం. తల్లి రెక్కల కష్టం ఆ బాలుడ్ని ఉన్నత విద్యావం తుడిగా తీర్చిదిద్దింది. జ్ఞాన జిజ్ఞాస వుండాలే కాని ఎన్ని అవరోధాలైనా అధిగమించవచ్చునని యాదవరెడ్డి విషయంలో గమనించవచ్చు. బి.ఎ, బి.ఇడి, హిందీ భూషణ్, ఎమ్.ఏ (మొదటి సంవత్సరం) పూర్తిచేసిన యాదవరెడ్డి హైద్రాబాద్‌లోని కేశవ్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలం ఉద్యోగించి 1996 సం॥లో ఉద్యోగ విరమణ గావిం చారు. 1960 నుండి 1966 దాకా చిన్నా చితక ఉద్యోగాలు చేసినా ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అంతగా ఉపయోగపడలేదు. కానీ ప్రపంచమంతా సుఖమయంగా, హాయిగా వుండాలనే రొమాంటిక్ భావనతో దైవభక్తి కొంతకాలం ఆయనను ఆవహించింది. ద్వైదీభా వం (సంశయం) ఆయన స్వభావంలో జీర్ణించుకుపోయింది. క్రైస్తవ దళితులు, హిందువులు, ముస్లింల మధ్య తిరిగిన యాదవరెడ్డి వారి సాహచర్యంతో మూడు మతాల జీవన విధానాన్ని ఆకళింపు చేసుకున్నారు. అందుకే హైదరాబాద్ సంస్కృతి దేశానికే ఆదర్శం అంటారు. చిన్న చిన్న దొంగ తనాలు, ఇంట్లోంచి పారి పోవడాలు లాంటి చిలిపి అల్లరి ఆయన బాల్య స్మృతిలో యింకా మెదుల్తునే వుంది.

> 'స్వీయ చరిత్ర' అనేది ఒక విశిష్టమైన ప్రక్రియ. జీవన వాస్తవికతకు దర్పణం పట్టే స్వీయ చరిత్రలో రచయిత జీవితంలోని ధర్మాధర్మాలు, సత్యా సత్యాలు, సుఃఖదుఖాలు, వెలుగునీడలు, తీపిచేదులు పాఠకుడికి తెలిసివస్తాయి.

హైస్కూల్లో చదువుతున్న రోజుల్లోనే ఆయన రాసిన చిన్న పిల్లల కథలు, వ్యాసాలు స్వేచ్ఛానువాదాలు వివిధ పత్రికల్లో అచ్చు అయ్యేవి. హిందీ, ఆంగ్లం, తెలుగు సాహిత్య పఠనం ఆయన నిత్య కృత్యమైంది. ఖలీల్ జీబ్రాన్ ఆయనకు అత్యంత యిష్టమైన కవి. ఆ మహాకవి కవిత్వాన్ని విస్తృతంగా అనువదించారు యాదవరెడ్డి. కవిత్వంకంటే ముందు బొమ్మ లు గీసే ప్రావీణ్యం గల యాదవరెడ్డికి కథారచన, రంగస్థల నటనలో గూడ ప్రవేశం వుంది.



ప్రతులకు: ఎమ్మెస్కో బుక్స్ ప్రైలి.
1-2-7, బానూకాలనీ
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్-500 029. తెలంగాణ.
నిఖిలేశ్వర్ సెల్:91-9177881201

చిన్నప్పుడు దైవభక్తి మెండుగా వుండేది. విజయవాడ నుండి రామేశ్వరం దాకా, కాలడి నుండి పాండిచ్చేరి దాకా యాత్రలు చేసిన యాదవరెడ్డికి భక్తి వ్యాపారాన్ని కళ్ళారా చూసి పుణ్య క్షేత్రాలనే దేవాలయాల చుట్టు అల్లుకున్న సంస్కృతి, జీవిత విధానం పట్ల గల భ్రమ విచ్ఛేదం కాసాగింది. పౌరాణిక కథలపై ఆసక్తి పెంచుకున్న యాదవరెడ్డి ఆధ్యాత్మిక చింతనతో కొంత కాలం తమిళ నాడులోని శ్రీరంగం (తిరుచినాపల్లి) దేవాలయ ప్రాంగణంలో నివసించడం గమనార్హం.

1963 సం॥లో BA (Final Year)లో వుండగా యామినిని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆయన రెడ్డి కాపు.. ఆమె గొల్ల (యాదవ). ఈ కులాంతర వివాహం ఆర్యసమాజ సంప్రదాయంలో జరిగింది. ఈ దంపతులకు నలుగురు సంతానం. నలుగురు పిల్లలకూ ఎలాంటి సాంప్రదాయక తంతు లేకుండా దండల మార్పిడి పెళ్ళి (రిజిస్ట్రేషన్) పద్ధతిలో కులాంతర వివాహాలు జరిపించారు యాదవరెడ్డి దంపతులు. యిద్దరూ అభ్యుదయ వాదులే. వారి చిన్నబ్బాయి సమీర్ అమెరికాలో ఉద్యోగిస్తున్న కాలంలో 2007 సం॥లో యాదవరెడ్డి దంపతులు మొదటి సారిగా అమెరికా వెళ్ళి అనేక ప్రాంతాలు దర్శించారు. 2014 సం॥లో మరోసారి యుఎస్ఏ వెళ్ళొచ్చిన యాదవరెడ్డి తన అనుభవా లను **'ఖండాంతరాల మీదగా'** శీర్షికన కవితా సంపుటి వెలువరిం చారు.

2015 సం॥లో భారత చైనా మిత్ర మండలిలో సభ్యుడిగా జన చైనాలో పర్యటించారు. ఈ పర్యటన అనుభవాలను **"మేము చూసిన జనచైనా"** శీర్షికన వెలువరిం చిన ట్రావెలాగ్‌లో ఆస్వాదించవచ్చు.

ఆంధ్రప్రదేశ్, తదితర ప్రాంతాల్లో ప్రజాస్వామ్య హక్కుల కోసం, పాలక వర్గాలను, పోలీసు యంత్రాగాన్ని నిలదీసి ప్రజల్లో ప్రశ్నించే దిశగా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (OPDR) కార్యక్రమాల్లో జ్వాలాముఖి తో కలిసి యాదవరెడ్డి చురుగ్గా పాల్గొన్నారు. వాస్తవ సేకరణ కమిటీల (నిజనిర్ధారణ) ద్వారా ఆయా ప్రాం తాల బాధితుల వద్ద కనుగొన్న వాస్తవాలను యాదవరెడ్డి **"ఎవరిదీ ప్రజాస్వా మ్యం? ఏ విలువకీ ప్రస్థానం?"** అన్న వ్యాస సంపుటిలో పొందుపరిచారు. ఈ సంపుటి 2000 సం॥లో వెలు వడింది.

యాదవరెడ్డి సాహిత్య ప్రస్థానంలో అతిముఖ్యమైన అధ్యాయానికి 1965 సం॥లో అంకురార్పణ జరిగింది. "దిగంబర్ కవిత్వం" పేరిట నూతన కవిత్వోద్యమం మార్చి నెల 1965 సం॥లో పురుడు పోసుకుంది. అప్పటికే వచన కవులుగా రాణిస్తున్న ఆరుగురు కవిమిత్రులు వారి అందరి పేర్లలోని కులాలను సూచిస్తున్న తోకలను త్యజించి కె. యాదవరెడ్డి నిఖిలేశ్వర్‌గా, ఏ.వి.రాఘవాచారి 'జ్వాలాముఖి'గా, కేశవరావు 'నగ్నమునిగా', 'కమ్మిశెట్టి మహాబోధి "మహాస్వప్న"గా, మన్‌మోహన్ దేశాయ్ 'భైరవయ్య'గా, బద్దంబాల్‌రెడ్డి 'చెరబండ రాజు'గా రూపాంతరం చెంది వారు కలలుగానే మరో ప్రపంచం కోసం దిగంబర కవిత్వానికి శ్రీకారం చుట్టారు. ఒక కొత్త ప్రపంచం కోసం, మానసిక దిగంబరత్వం కోసం, వ్యక్తి అస్తిత్వ పరిరక్షణ కోసం, అంతరంగంలో అణగిపడివున్న ఆరాటాన్ని, ఆవేదనను, విసుగును అక్షరాల్లో వ్యక్తీకరించి, నూతన విశ్వాసాన్ని, ఆశను కలిగిం చాలనే తత్పరతతో 1965 సం॥ మే ఆరవ తేదీన 'దిగంబర కవులు' మొదటి కవితా సంపుటి ఆవిష్కృ తమైంది. 1966 సం॥ డిసెంబర్ 19-20 తేదీల మధ్య అర్ధరాత్రి రెండో కవితా సంపుటి వెలువడింది. ఆరుగురు కవుల ఈ కవితా సంపుటాల్లో ఎవరి కవితా ముద్రవారిదే. ఎవరి ప్రత్యేకత వారిదే. 1968 సం॥ జూన్ మాసంలో విశాఖపట్నం వేదికగా మూడవ కవితా సంపుటి ప్రకటింపబడింది. దిగంబర కవుల కవితా ప్రక్రియకు 'దిక్' అని నామకరణం గావించారు.

1965-1968 మధ్య వెలువడిన మూడు కవితా సంపుటాల తర్వాత నాలుగవ సంపుటిని మార్క్సిజం- లెనినిజం-మావో ఆలోచనా విధానం లోని సిద్ధాంత తాత్త్వికత ప్రాతిపదికన రాయాలన్న సూచనను మహాస్వప్న, భైరవయ్యలు వ్యతిరేకించారు. ఎలాంటి సిద్ధాంతానికి కట్టుబడకుండా తాము స్వేచ్ఛగా రాసుకుంటామని 1969లో వారు విడిపోయారు. మిగిలిన నలుగురు దిగంబర కవులు 'విరసం'లో విలీనమైపోయారు. కారణాలు ఏమైనప్పటికీ.. దిగంబర కవిత్వంలో అశ్లీలం మరియు బూతు పదాల ప్రయోగం ఎక్కువగా వుందని విమర్శలు వెలువడటం మాత్రం వాస్తవం.

తెలుగు సాహిత్యంలో ఉవ్వెత్తున ఎగిసిపడిన ఉద్యమం, చరిత్రలో తనకంటు ఓ స్థానం కైవసం చేసుకున్న దిగంబర కవిత్వం మటుమా యమైంది. తదనంతర కాలంలో విరసంలో కొనసాగలేని పరిస్థితుల్లో నిఖిలేశ్వర్ బయటకు వచ్చేసారు.

1971-72 మధ్య తన జైలు జ్ఞాపకాలను **'గోడల వెనుక'** పేరిట నిఖిలేశ్వర్ వెలువరించారు. ఈ జ్ఞాపకాలు ఇంగ్లీష్, హిందీ, పంజాబీ, కన్నడ మరియు మలయాళంలోకి అనువదింపబడి ప్రచురణకు నోచుకోవ డమే గాకుండా.. 'వాల్స్' శీర్షికన ఢిల్లీ నుండి వెలువడే 'దిపాయింట్ ఆఫ్ వ్యూ" వీక్లీలో సీరియల్‌గా వచ్చింది. 1990 తర్వాత 'స్వాతి' మాసపత్రిక అనుబంధంగా పునర్ముద్రణ వెలువడింది.

> నిఖిలేశ్వర్ ఆత్మకథను ఆసాంతం చదివిన తర్వాత ప్రముఖ పాత్రికేయుడు కె. శ్రీనివాస్ రాసిన ముందు మాటతో పాఠకులు ఏకీభవిస్తారనడంలో సందేహం లేదు.

దేశం నలుమూలలా జరిగిన వివిధ ప్రజాసంఘ, సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొని తన వక్తృత్వం తో అశేష అభిమానులను ఆకట్టుకున్నారు నిఖిలేశ్వర్.

2007 సం॥లో తిరుపతిలో జరిగిన తెలుగు భాషా బ్రహ్మోత్స వాల సమాపనోత్సవంలో నిఖిలేశ్వర్ పాల్గొనడం జరిగింది. ఈ బృహత్ కార్యక్రమం భూమన కరుణారెడ్డి నేతృత్వంలో అత్యంత విజయవంతం గా నిర్వహించబడ్డది. 'భూమన విద్యార్థి ఉద్యమాల్లో రాజకీయాల నుండి ఎదిగివచ్చి, నక్సలైట్‌గా ముద్రపడి, ఎమర్జెన్సీలో జైలులో వుండి కాలక్రమంలో టిటిడి అధ్యక్షుడు గావడం ఒక విశేషం'గా పేర్కొంటారు నిఖిలేశ్వర్. చాలామందికి తెలియని విషయం యిది.

నీలం రాజశేఖర రెడ్డి, ఎస్. జైపాల్‌రెడ్డి, కాళోజి, కె.జి. కన్నాభిరాన్ వంటి ప్రముఖులతో తన పరిచయాలను.. వారితో తాను పంచుకున్న అనుభవాలను తెలియజేస్తారు నిఖిలేశ్వర్.

ఖండాతరాల మీదుగా దేశ, విదేశాల్లోని అనేక ప్రదేశాలు పర్యటించి ఆ అనుభవాలను మనతో పంచుకుం టారు నిఖిలేశ్వర్ ఈ ఆత్మకథలో.

నిఖిలేశ్వర్ జీవన యానంలో అత్యంత విషాద సంఘటన సహధర్మచారిణి యామిని మరణం. 55 సం॥ల వివాహ బంధానికి స్వస్తి చెప్పి 2021 సం॥లో ఆమె శాశ్వత నిద్రలోకి జారుకుంది. తోడు వుండాల్సిన వృద్ధాప్యంలో నిఖిలేశ్వర్ ఒంటరిగా మిగిలిపోవడం నిజంగా విషాదం.

2021 సం॥ నిఖిలేశ్వర్‌కు ఊరట కలిగించిన సందర్భమూ లేకపోలేదు. ఆయన సృజించిన **"అగ్ని శ్వాస"** కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించింది. ఎప్పుడో దక్కాల్సిన గరవం ఆలస్యంగానైనా దక్కిందని సాహితీ ప్రియులు ప్రశంసించారు.

నిఖిలేశ్వర్ ఆత్మకథను ఆసాంతం చదివిన తర్వాత ప్రముఖ పాత్రికే యుడు కె. శ్రీనివాస్ రాసిన ముందు మాటతో పాఠకులు ఏకీభవిస్తారన డంలో సందేహం లేదు. ఏ వ్యక్తీ తనను తాను ఎక్కువా అంచనా వేసుకోకూడదు.. అలా అని తక్కువా చేసుకోకూడదు. నిఖిలేశ్వర్ విషయంలో రెండవది కొంత వాస్తవమేమో అనిపిస్తుంది.

దిగంబర కవుల్లో ప్రసిద్ధులైన నిఖిలేశ్వర్ ఆ కవిత్వంలోని విశేషా లను, విశ్లేషణను మరింత విపులంగా చర్చించలేదని అభిప్రాయపడ్డే ఆ తప్పు పాఠకుడిది కాదు. దేశ విదేశాల్లో ఆయన పర్యటనానుభవాన్ని, మహామ హులతో పరిచయాలను కేవలం ప్రస్తావించారే గాని మరింత విస్తృతంగా రాసివుంటే చదువరులకు స్ఫూర్తి దాయకంగా వుండేది. తన జీవితానుభవాలు కాలానుగుణంగా అమర్చి ఒక తెగిపోని ధారలా సాగివుంటే మరింత బాగుండేది. చదివిందే మళ్ళీ, మళ్ళీ పునరావృతం కావడం పాఠకుడి ఉత్సుకతకు అడ్డుకట్టలా నిలవడం గమనించవచ్చు.

కె. శ్రీనివాస్ అభిప్రాయపడ్డట్టు "నిఖిలేశ్వర్ తన లోపాలను, బలహీనతలను వివరిస్తేనే స్వీయ చరిత్రకు సార్థకత అనుకుని వుంటారు. తన విస్తృత జీవితంలోని నాయక అంశాలను ప్రాంధాన్యీకరించి, విపులంగా ప్రకటించి, తన స్థానాన్ని నిర్వచించుకోవడానికి ఆయనకు సజ్జనత్వం అడ్డువచ్చి వుండాలి.

ఆయన జీవితంలో కావలసినంత ఇతివృత్తం, కథాంశం, నాటకీయత వున్నాయి. ఈ ఆత్మకథ చదవడం పూర్తిచేశాక, నిఖిలేశ్వర్ తన ఆత్మకథా రచనకు పూర్తి సంసిద్ధులు కాలేదేమోననిపిస్తుంది. తన విజయాల గురించి, వ్యక్తిత్వ విశేషాల గురించి తనే చెప్పవలసి రావడం మీద ఆయనకు విముఖత వున్నది. పూరించవలసినవి అనేకం వుండిపోయాయి. గుప్తధనాన్ని అట్లాగే దాచుకుని, ఖజానా ఖాళీ అయిందంటే ఎట్లా? తన ఆత్మకథకు నిఖిలేశ్వర్ సీక్వెల్ రాస్తారు. నిఖిల సాహిత్యలోకం రాయించుకోవాలి." యిదీ కె. శ్రీనివాస్ ముందుమాట.

వేచి చూద్దాం.. సీక్వెల్ కోసం..

సాహిత్య వరేణ్యులు

అసమాన ప్రతిభామూర్తి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి



సాహిత్యవేత్తగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, ఆచార్యుడిగా, కవిగా, రచయితగా, రేడియో వ్యాఖ్యాతగా, గ్రంథ సంపాదకుడిగా, పత్రికా కామెంటరీగా పేరుగాంచిన ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తెలుగు సాహిత్యంలో లబ్ధప్రతిష్ఠులు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేసిన వారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎల్లూరి శివారెడ్డి నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ తాలూకా నియోజకవర్గంలోని చిన్నంబావి మండలం కొల్లూరు గ్రామంలో నరసమ్మ, మందారెడ్డి దంపతులకు 1945 సంవత్సరం లో ఏప్రిల్ 7 న నాల్గవ సంతానంగా జన్మించారు.

ప్రాథమిక విద్య

శివారెడ్డి ప్రాథమిక విద్యను తమ గ్రామంలోనే, హైస్కూలు విద్యను కొల్లాపూర్ లో చదివి పీయూసీ నుంచి పిహెచ్.డి వరకు హైదరాబాద్‌లో చదివారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ (తెలుగు)లో ప్రథమస్థానంలో ఉత్తీర్ణులై స్వర్ణపతకం సాధించారు. అనంతరం డాక్టర్ సి. నారాయణ రెడ్డి పర్యవేక్షణలో "ఆంధ్ర మహాభారతంలో రసపోషణం" (విరాట, ఉద్యోగ పర్వాలు) అనే అంశంపై పరిశోధన చేసి పి.హెచ్.డి పట్టా పొందారు. అలాగే ఎం.ఏ. సంస్కృతంలో కూడా ప్రథమస్థానంలో ఉత్తీర్ణులై స్వర్ణపతకాన్ని సాధించారు. అటు తెలుగు సాహిత్యంలోనూ, ఇటు సంస్కృత సాహిత్యంలోనూ అపార పాండిత్యాన్ని సముపార్జించిన ప్రతిభ,మూర్తి.

కుటుంబ జీవితం

ఆచార్య ఎల్లూరి శివారెడ్డికి లక్ష్మితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్ళు, ఒక కుమారుడు ఉన్నారు. కూతుళ్ళు ఎల్లూరి కవిత, మండ్లి రమలు కాగా కుమారుడు పేరు ఎల్లూరి భాస్కరరెడ్డి.

ఉద్యోగ పర్వం

తన చదువు పూర్తయిన తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యుడిగా ఉద్యోగ జీవితాన్ని ఆరంభించారు. 34 సంవత్సరాలకు పైగా అదే విశ్వవిద్యాలయంలో వివిధ అత్యున్నత హోదాలలోను పనిచేశారు. 1992 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా చేరి రీడరుగా, ప్రొఫెసర్ గా, తెలుగుశాఖ అధ్యక్షులుగా, పాఠ్యప్రణాళిక చైర్మన్ గా పనిచేశారు. అలాగే రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో పాఠ్యప్రణాళిక సభ్యులుగాను పనిచేశారు. 2002 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం శాఖాధిపతిగా పదవీవిర మణ చేశారు. మొత్తం 34 సంవత్సరాల పాటు తెలుగు సాహిత్య విద్యార్థులకు బోధన చేశారు. అనంతరం ఆయన తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా 2012 నుంచి 2015 వరకు పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు.

పరిశోధకుడిగా అందవేసిన చెయ్యి

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మహాభారతాన్ని క్షుణ్ణంగా చదవడమే కాదు, మహాభారతం మీద సాధికారికమైన పట్టు ఉన్నవారు. ఈ అంశంపైనే చేసిన సిద్ధాంత గ్రంథానికి విశేషమైన గుర్తింపు లభించింది. విద్యా మరియు లలితకళలలో చేసిన కృషి అత్యంత శ్లాఘనీయమని చెప్పక తప్పదు. అందరితో స్నేహభావంతో మెలిగే శివారెడ్డి అందరికీ తలలో నాలుకలా మెదులుతారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో ఎందరో పరిశోధక విద్యార్థులకు మార్గదర్శనం చేస్తూ వారి ఎం.ఫిల్, పి.హెచ్.డి పరిశోధనలు పూర్తికావడానికి తన సహాయసహకారాలను అందించారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాల యాలలో దాదాపు 55 మంది పరిశోధక విద్యా ర్థులకు పర్యవేక్షకుడిగా ఉన్నారు. వీరి పర్య వేక్షణలో అనేక గ్రంథాలు కూడా వెలువడ్డాయి.

రచనలు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి "తిక్కన రసభారతి, రసరేఖలు, భావదీపాలు, పూలకారు, సురవరం ప్రతాపరెడ్డి జీవితం - సాహిత్యం" వంటి గ్రంథాలను రచిం చారు. "సురవరం ప్రతాప్‌రెడ్డి జీవితం - సాహిత్యం" అనే గ్రంథానికి అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. ప్రసిద్ధ విమర్శకులు కట్టమంచి రామలింగారెడ్డి రచించిన "మునలమ్మ మరణం" పద్యకావ్యానికి చక్కని వ్యాఖ్యానం చేశారు. ఇది బహుళ ప్రజాదరణ పొందింది. అలాగే తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రచురించిన పలు గ్రంథాలకు ఆయన సంపాదకత్వం వహించారు. అనేక సాహిత్యపత్రికలకు శతాధిక పరిశోధక రచనలు చేశారు. అలాగే వివిధ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సాహిత్య సదస్సు లలో 45 పరిశోధన పత్రాలను సమర్పించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వ విద్యాలయం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తదితర విశ్వవిద్యాలయాల్లో పాల్గొని పత్రసమర్పణ చేశారు.

సంపాదకాలు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అనేక గ్రంథాలకు సంపాదకుడిగా వ్యవ హరించారు. సురవరం ప్రతాపరెడ్డి వైజయంతి ట్రస్ట్ ప్రచురించిన అనేక గ్రంథాలకు వీరు సంపాదకులుగా వ్యవహరి ంచారు. "గోల్కొండ పత్రిక సంపాదకీ యాలు (రెండు భాగాలు), సురవరం ప్రతా పరెడ్డి నాటకాలు,

సురవరం ప్రతాపరెడ్డి పీఠికలు, సురవరం ప్రతాపరెడ్డి కథలు, సురవరం ప్రతా పరెడ్డి పరిశోధన జ్ఞాపికలు, సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు (రెండు భాగాలు), హిందువుల పండుగలు, రామాయణ విశేషాలు" వంటి గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. ఇంకా "సినారె సాహిత్య సమాలోచన, ఆంధ్ర సారస్వత పరిషత్తు స్వర్ణోత్సవ సంచిక, వజ్రోత్సవ సంచిక, తెలుగు - తెలుగు నిఘంటువు, పరిణితవాణి, తెలుగు సాహి త్యంలో హాస్యం, సాహిత్యానువాదం - సమాలోచనం, తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం, వివేచన" వంటి తదితర గ్రంథాలకు సంపాదకత్వం వహించారు.

పురస్కారాలు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తెలుగు సాహిత్యానికి చేసిన సేవకు గుర్తింపుగా వివిధ సంస్థలు అనేక పురస్కారాలను అందజేశాయి. సురవరం ప్రతాపరెడ్డి జీవితం గురించి 1972 లో రచించిన "సుంవరం ప్రతాపరెడ్డి జీవితం - సాహిత్యం'' అనే గ్రంథానికి అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డును అందుకు న్నారు. 1998 లో "పూల కారు" పద్యకావ్యసంపుటికి స్వర్ణసాహితి పురస్కారాన్ని, 1998లో రసమయి సంస్థ సురవరం సాహితి పురస్కా రాన్ని, బాబుల్ రెడ్డి ఫౌండేషన్ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం, 2004 లో రసమయి టాలెంట్ అవార్డు, కవిత్రయ అవార్డు, 2007 సంవత్సరంలో జ్యోత్స్న కళాపీఠం అవార్డు, 2009 సంవత్సరంలో కవిరత్న నీల జంగయ్య అవార్డు, 2010 లో రసమయి అక్కినేని జీవిత సాఫల్య పురస్కారం, 2011 లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర నిలయం వారి మహాకవి దాశరథి అవార్డు, ఇరివెంటి కృష్ణమూర్తి అవార్డు, రసమయి దేవులపల్లి రామానుజరావు అవార్డు, 2012 లో నాట్స్ జీవిత సాఫల్య పురస్కారం, 2014 లో ఆచార్య పల్లా దుర్గయ్య స్మారక అవార్డు, యువకళావాహిని బి.ఎన్. అవార్డు, రాయసం సుబ్బారాయుడు సాహిత్య అవార్డు, 2015 లో తిరుమల శ్రీనివాసాచార్య ధర్మనిధి పురస్కారం, 2016 లో ఢిల్లీ తెలుగు అసోషియేషన్ జాతీయ పురస్కారం, ఢిల్లీ తెలుగు విద్యాసంస్థ సమైక్య భారతి ఎక్సెలెన్స్ అవార్డు, 2017 లో డా.అంజిరెడ్డి సాహిత్య పురస్కారం, ఢిల్లీ తెలుగు ఎడ్యుకేషన్ సొసైటీ అవార్డు, కె.వి.రమణ - వంశీ జీవన సాఫల్య పురస్కారం, సృజన జీవన సాఫల్య పురస్కారం, అభినందన సినారె సాహిత్య పురస్కారం, కపిలవాయి లింగమూర్తి సాహితీ అవార్డు, 2018 లో టీ.ఎస్.ఆర్ కాకతీయుల లలితా కళాపరిషత్ కాకతీయ పురస్కారం, జి.వి.ఆర్ కల్చరల్ అసోసియేషన్ సినారె సాహితీ పురస్కారం, మరియు "సాహితీ సార్వభౌమ" బిరుదు ప్రదానం, 2021 లో తెలంగాణ ప్రభుత్వ దాశరథి సాహితీ పురస్కారం, 'శాంతా వసంతా ట్రస్టు' వరప్రసాద్ రెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారం వంటి తదితర పురస్కారాలను అందుకున్నారు.

తెలుగు సాహిత్యంలో లబ్ధ ప్రతిష్టులైన
ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారి
ఏప్రిల్ 7 జన్మదినం సందర్భంగా....
-సంపాదకులు



బాధ్యతలు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నపుడే వివిధ హోదాల్లో పనిచేశారు. 1996 నుంచి 1999 వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయ ఎకడమిక్ ఉద్యోగుల కాలేజి సభ్యులుగా, 1983 నుంచి 2002 వరకు డిపార్ట్మెంట్ కమిటి సభ్యులుగా, 1996 నుండి 2002 వరకు పోస్టు గ్రాడ్యువేట్ సంస్థ సభ్యులుగా, 1996 నుండి 1999 వరకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సంఘం యొక్క సభ్యులుగా, 1997 నుండి 1999 వరకు బెంగుళూరు విశ్వవిద్యాలయం సంఘం యొక్క సభ్యులుగా, 1997 నుండి 1998 వరకు కాకతీయ యూనివర్సిటి ప్రాచీన విద్యా సంఘం సభ్యులుగా, 1998 నుంచి 2000 వరకు నాగార్జున యూనివర్సిటి సంఘం సభ్యులుగా పనిచేశారు. అలాగే 1998 సంవత్సరంలో సివిల్ సర్వీసెస్ - యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ కమిటి సభ్యులుగా, 2001 సంవత్సరంలో యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిటి సభ్యులుగా, 2001 నుండి 2003 వరకు బెనారస్ హిందు విశ్వవిద్యాల యం సభ్యులుగా, 2000 నుంచి 2005 వరకు శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం సభ్యులుగా, 2008 సంవత్సరంలో వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సంఘం సభ్యులుగా, 2007 నుండి 2009 వరకు తెలుగు విశ్వ విద్యాలయం సంవత్సరం సంఘం సభ్యులుగా, తిరుమల తిరుపతి పురాణ ఇతిహాస సంస్థ సభ్యులుగా, 2012 నుంచి 2016 వరకు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేశారు.

సాంస్కృతిక సంస్థ పదవులు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అకాడమిక్ బాధ్యతల్లోనే కాకుండా ఇతర పదవులను కూడా సమర్థవంతంగా నిర్వర్తి ం చారు. 1996 నుంచి తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యద ర్శిగా, 1992 నుంచి తెలంగాణ సాంస్వత పరిషత్తు ట్రస్ట్ కార్యదర్శిగా, 1998 లో సురవరం ప్రతాపరెడ్డి శతాబ్దపు సంవత్సరం ఉత్సవ కార్యదర్శిగా, 1998-2005 లో సురవరం ప్రతాప రెడ్డి వైజయంతి సంస్థ కార్యదర్శిగా, శ్రీనివాస్ సాహితీ సమితి ఉపాధ్యక్షులుగా, జ్యోతిర్మయి సాంస్కృతిక సంస్థ ఉపాధ్యక్షులుగా, 1999లో ఆంధ్రప్రదేశ్ నంది ఫిలిమ్స్ అవార్డు న్యాయ సంఘం అధ్యక్షు లుగా, 1999-2001లో తిరుమల తిరుపతి పబ్లికేషన్స్ సభ్యులుగా, 2000-2001లో సుశీల నారాయణ రెడ్డి సాహిత్య అవార్డు సంఘం సభ్యులుగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యా తనిఖీ సభ్యులుగా పనిచేశారు. 2012 లో గురజాడ అప్పారావు 150వ జయంతి ఉత్సవాల కమిటి సభ్యులు గా, 5 వ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రత్యేక సంచిక సంపాదకులుగా, 2015 - 2016 దాశరథి కృష్ణమాచార్య అవార్డు కమిటి అధ్యక్షులుగా, 2017 లో తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులుగా పద వీ భాధ్యతలు స్వీకరించి నేటికీ కొనసాగుతున్నారు.

సురవరం ప్రతాపరెడ్డి సాహితి వైజయంతి ట్రస్ట్ అధ్యక్షులుగా 2017 ఎన్నికయ్యారు. అంతేకాదు తెలంగాణ సారస్వత పరిషత్తు కార్యదర్శిగా ఉన్నప్పుడు ఆంధ్రుల జీవిత విధానము పరివర్తన దిశలు, తెలుగులో ఈ తరం విమర్శకులు, తెలుగు సాహిత్య జానపద ప్రభావము, జాతీయ యోద్యమాలు కవన శంఖారావము, తెలుగు వాగ్గేయ కారకులు - అన్నమయ్య వ్యాప్తిక వ్యక్తికత్వము, ఆధునిక తెలుగు సాహిత్య హాస్యము, సాహిత్య అనువాదం సమాలోచనము, ప్రాచీన తెలుగు కావ్యాలు - సంగీత నృత్యం, భారతీయ ప్రథమ స్వతంత్ర సంగ్రామము (1857) తెలుగు సాహిత్య ప్రభావము, మీడియా వర్క్ షాప్ క్యాంపు, పిల్లల పద్యరచన సభ, ఫిలిమ్స్ పాటలు బోధనా క్యాంపు వంటి సదస్సులను సమర్థవంతంగా నిర్వహిం చారు.

నిరంతరం సాహిత్య సేవలో తలమునకలవుతున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మరో అక్షర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్తగా 33 జిల్లాలు ఏర్పడ్డాయి. ఈ కొత్త జిల్లాల చరిత్రలను భావితరాలకు అందించాలనే తపనతో జిల్లా చరిత్రలకు శ్రీకారం చుట్టారు. మనదైన చరిత్రను సమాజానికి అందించాలనే సదుద్దేశంతో సారస్వత పరిషత్తు అధ్యక్షు లుగా ఈ జిల్లా చరిత్ర రచన లకు ముందడుగు వేశారు.

ఇంటర్వ్యూ :
- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017













ఉగాది మొగ్గలు

రాలిపోయిన ఆకులు మళ్ళీ చిగురించినప్పుడే
ప్రకృతి పరవశంతో ఆనందంగా నాట్యమాడేది
నవరస పరిమళాల షడ్రుచుల పండుగ ఉగాది.

కాలం సరికొత్త చిగురులను తొడిగినప్పుడే
జీవితం వసంతమై నవోన్మేషంగా పల్లవించేది
సుఖసంతోషాల చెరకుతీపి పండుగ ఉగాది.

మదిలో చేదుజ్ఞాపకాలను మరిచిపోయినప్పుడే
ఆనందాల అనుభూతులను అనుభవించేది
చేదు జ్ఞాపకాల వేపపూత పండుగ ఉగాది.

వసంతకోకిలు కవితాగానం చేసినప్పుడే
మామిడితోరణాలు స్వాగతగీతం పలికేది
వగరుపంచే మామిడికాయ పండుగ ఉగాది.

కష్టసుఖాలు జీవితంలో భాగమైనప్పుడే
కడవరకు బతుకుబండిని నేర్పుగా నడిపేది
చింతపండు పులుపు పండుగ ఉగాది.

షడ్రుచులను జీవితంలో రుచిచూసినప్పుడే
మంచిచెడులను సమన్వయంతో స్వీకరించేది
సహనం నేర్పే మిరపకారం పండుగ ఉగాది.

కొత్తవసంతం ఉల్లాసంగా అడుగిడినప్పుడే
ఉత్సాహంగా జీవితం నవరసభరితమయ్యేది
రుచికి సంకేతమైన ఉప్పు పండుగ ఉగాది

- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017

ఉగాది వారసులు

అవునన్నా... కాదన్నా, తెలుగు అక్షరాల సాక్షిగా
అప్పటికీ, ఇప్పటికీ...మరి ఎప్పటికీ
ఉగాదికి వారసులు... చరిత్రలో కవులు మాత్రమే.
ఆ వారసత్వంలో ఆస్తుల పంపకాలు లేవు...
అంతస్తుల తగాదాలు అసలే లేవు
నిత్యం శాంతికపోతాల రెక్కల ఈకల్లో
విశ్వశాంతి గేయానికి స్వరకల్పన చేస్తున్నారు
గాయపడ్డ హృదయాలకు
ఓదార్పు ఔషధాలవుతున్నారు
దిగంతాలను ధిక్కరించే అక్షరాలను
కవితల్లో సంధించిన ప్రతిసారి...
విశ్వశ్రేయస్సుకోసం నేను సైతం
ఆహుతి అవుతానంటూ...
హామీపత్రాలమీద పోటీపడి
కవులు సంతకాలు పెడుతున్నారు.
ఆకలేస్తే .....కవితలతో
కడుపునింపుకునే కవులంతా
ఖాళీ అవుతున్న మానవత్వ మందిరాలలో
తిరిగి అభిషేకాల పూజలకోసం
సమాయత్తమవుతున్నారు.
చెప్పాలంటే వేపపువ్వులోని తెల్లదనానికి
తమ చిరునవ్వుల పుప్పడితో
కవులు నగిషీలు చెక్కుతున్నారు
ఉగాది పచ్చడిలోని షడ్రుచులకు
షామియానాలు వేస్తూ...
పంచాంగంలోని అంగంగానికి
అర్థాలు చెప్తున్నది వాళ్లే
రాహుకాలాలకు చెల్లు చీటీలు రాస్తూ...
శుభగడియలకు నిత్యం తలుపులు తీస్తున్నది
కవులు మాత్రమే
సూర్యుడు సైతం కవులకు నమస్కారం
కవి అంటే, కేవలం ఓ వ్యక్తి కాదు,
నిత్యం మండే ఓ నిప్పుకణం
కవిత్వమంటే కేవలం
అక్షరాల వరుసలు కాదు
కవాతు చేస్తున్న లక్ష సైనికుల సమూహం
గంగాజలాన్ని తీసుకొచ్చి
అందులోకి తొంగి చూస్తే..
కనిపించేవన్నీ సాక్షాత్తు కవుల సంతకాలే...
అందుకే నేనంటాను ...
ప్రతి ఏడాది, ఉగాదికి పేరు మారినా
వారసత్వ పత్రాలమీద మారని పేరు మాత్రం
అప్పటికీ, ఇప్పటికీ, మరి ఎప్పటికీ
ఒక్క కవులది మాత్రమే

-డా. కె.జి. వేణు,
98480 70084

అందరిదేగా !
అందమైనదేగా !!
షడ్రుచులతో పచ్చడి, పంచాంగంతో కూడినది,
ఉగాదియేగా !!!
-నేమాన సుభాష్ చంద్ర బోస్, విశాఖపట్నం.

ప్రకృతి
ఆకృతి
నేలతల్లి ఆహ్వానం వసంతుడు సగౌరవ స్వీకృతి
-ఆలేటి పరంజ్యోతి , ఖమ్మం

రంజాన్ మాసం
పవిత్రమాసం
దివ్యఖురాన్ అవతరించి అందించెను
మానవులకు దైవసందేశం
-ఎం.ఏ. గఫర్
ఉప్పునుంతల ,నాగర్ కర్నూల్ జిల్లా

దానం!
ధ్యానం!!
ఉపవాసదీక్ష, అనంతరం పేదవారికి సాయం
ప్రధానం!!!
-మన్నవ సుధాకర్, విజయవాడ.

మాసం
ఉపవాసం
దివ్యఖురాన్ అవిర్భవించినది మానవుని
కాపాడడం కోసం
-వి శ్రీనివాస మూర్తి, హైదరాబాద

నిస్వార్థము
యథార్థము
ఉపవాసదీక్ష ఆత్మప్రక్షాళన పవిత్రజీవనం
రంజాన్ పరమార్థము
-కోటమహంతి వెంకటరావు(కోవెరా),
విశాఖపట్నం

భువనం
జీవనం
ఆరోగ్యమే షడ్రుచుల ఉగాది పచ్చడి సేవనం
-సింగీతం విజయలక్ష్మి, చెన్నై

నూత్నవర్షం !
హర్షం !
క్రోధి అయినా తేవాలి జనావళికి సకాలవర్షం !!!
-అంగర వెంకట సత్య గోపాలస్వామి,
తూరంగి, కాకినాడ.

అనాది
పునాది
తస్కరింపబడిన వేదాలను బ్రహ్మకొసగిన ఆది
ఉగాది
-విత్తనాల విజయ కుమార్, హైదరాబాద్

వచ్చింది
మెచ్చింది
జకాత్ దానములతో రంజాన్ సంబరాలు
తెచ్చింది.
-డాక్టర్. షహనాజ్ బతుల్, హైదరాబాద్

గడుపు
విడుపు
రక్షణ, కరుణ కురిపించే రమదాన్ నెలపొడుపు
-మాధవి మేళ్ళచెర్వు, గుంటూరు

పరాగం
సరాగం
నవపల్లవంతో నినదించే తరువులు వినిపిస్తాయి
వసంతరాగం
-విన్నకోట ఫణీంద్ర, హైదరాబాద్

భక్తి
ముక్తి
ప్రవక్త సూక్తి పాటిస్తే ప్రాప్తించు శక్తి!
-ఆచంటి శ్రీనివాసరావు, తెనాలి.

నవ్వు
రువ్వు
ఉగాది పండగ జరిగేనా లేకుండా వేపపువ్వు
-శేష శైలజ (శైలి), విశాఖపట్నం

ఇది
ఉగాది
శ్రీక్రోధి మకుటంతో క్రొత్తను స్వాగతిస్తోంది మది!
-యన్.కే. నాగేశ్వరరావు, పెనుగొండ.

ఆమని
భామిని
చిగురులెత్తిన సొగసులతో పరిఢవిల్లింది వసంత యామిని
-జూలూరి శైలజ, హైదరాబాద్.

తోరణము
ప్రేరణము
ఉగాది ఉత్సాహానికి పంచాంగశ్రవణమూ,
కవిసమ్మేళనమూ కారణము
-కాళీపట్నపు శారద, హైదరాబాదు

తెస్తోంది
ఇస్తోంది
క్రోధి షడ్రుచుల వైభోగం అందించ వస్తోంది !
-కె.కె.తాయారు, మదనపల్లి

గతం
అసంగతం
పీడకలలు మరచి శుభవాస్తవాలకు పలుకుదాం
స్వాగతం!
-గోగినేని రత్నాకరరావు , తెనాలి.

పండుగ
మెండుగ
అందరి జీవితాల్లో ఆనందోత్సవాలు కురియాలి
నిండుగా...
-పంతుల లలిత-నీలాంజన, విశాఖపట్నం

మది
హృది
ఉల్లాసంగా ఉంటేనే ఆనందడోలికల్లో
జర్జుపుకోగల్గం ఉగాది.
-మధురకవి వెంకట కృష్ణారావు, విజయనగరం.



నిండుగా
మెండుగా
ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకొనేది ఉగాది
పండుగ
- ప్రసాద్ రావు, విజయనగరం.

మావి
మోవి
లేచివురుల పూతల కూజితాల
వసంతాల నెత్తావి
-డాక్టర్ వరలక్ష్మి హరవే, బెంగుళూరు

తీర్థము
పదార్థము
మానవోద్వేగాలకు ప్రతీక, షడ్రుచుల ఉగాదిపచ్చడి
పరమార్థము.
-బీసమల్ల వెంకటేష్
జినుకుంట గ్రామం,నాగర్ కర్నూల్ జిల్లా

రాశి
వాసి
ఫలితాలకై ఆరాటపడతారు ఉగాదిన పంచాంగం
చూసి
-అర్చన కోవూరు, హైదరాబాద్

నాటి తరం వారి కథలు నేటి తరానికి
కథల వంతెన

నాదానీ

కథ



-డా॥నందిని సిధారెడ్డి
సెల్:9440381148



టాటా సుమో గేటు దగ్గరిదాకా వెళ్లి ఆగింది. దబదబా డోరు తెరుచుకొని ఆరుగురు వ్యక్తులు దర్పంగా దిగింద్రు. దిగిన తీరు, నడిచిన తీరు, చూసిన తీరు చాలా ప్రత్యేకంగా వున్నయి. ఇద్దరు గన్‌మెన్‌లు, ముగ్గురు యువకులు అనుసరిస్తుండగా ఒకతను మరింత హుందాగా రెండడుగులు నడిచి ఒక్క క్షణం ఎడమపక్కకు పరిక్షించి చూసిండు. చాలామంది రెండు చేతులు జోడించింద్రు.

అప్రయత్నంగా సులోచన కూడా నమస్కరించింది. ఏమాత్రం కాతరు చేయకుండా అతను లోపలికి నడిచిండు.

'మండలాధ్యక్షురాలి భర్తకే గింత పోకడా' అనుకున్నది. పోయినసారి రాఘవాపూర్ వచ్చినప్పుడు ఎమ్మెల్యే ఈయనా ఎంతో మర్యాదగా మాట్లాడింద్రు–లేకపోయుంటే తను నమస్కరించేదే కాదు.

ఆ గల్లీ నిండా సందడి సందడిగా వున్నది. రకరకాల కార్లు ఆగి వున్నయి. పోలీస్ వ్యాన్ పక్కన ఎనిమిది మంది జవాన్లు జోకులు వేసుకుంటా నవ్వుతున్నారు. అక్కడక్కడ చెట్ల కింద గుంపులు గుంపులుగా జనం. ఆధునిక చెట్లు, బాగా పొడుగ్గా పెరిగినా నీడ కొంచెమే వుంది. ఊర్ల నుంచి వచ్చినవాళ్లు ఇరికిరికి కూచోని యాష్టపడుతున్నరు. చోటామోటా నాయకులు, పైరవికార్లు అటూ ఇటూ తిరుగుతూ పలకరించుకుంటున్నరు. వొచ్చేవాళ్లు పొయ్యేవాళ్లు చిన్నపాటి జాతర లెక్క వుందక్కడ.

ఐదారు నెల్లకోసారి ఆ గల్లికి ఆ వైభవం పడుతది. సులోచన కాంపౌండ్ గోడ నానుకుని కూచున్నది. మిగత ఆడవాళ్లు మెల్లగ వచ్చి కూచున్నరు. సులోచనకు తలనొప్పి మొదలైంది. ఈ మధ్యల ఆరోగ్యం సుస్తుంటుంది. ఆ బాధ మనసులకెళ్లి పోతలేదు. ఈ మనసులు కూడ చిత్రమైనోళ్లే. మండలాధ్యక్షురాలి నెవలూ కానరు. ఆమె భర్తకింత...కొంగుతో చెమట తుడుచుకున్నది.

వొచ్చి ఐదు గంటలైంది. యామ్మెల్యే దర్శనం కాలే. పొద్దున తక్కువమంది వుంటరంటే మబ్బుల లేచి వంటచేసి పెట్టొచ్చింది. పిల్లల్ని స్కూలుకు పంపకుంటనే వొచ్చింది.సరింగ తిన్నదో, లేదో, ఆయన పక్క వూరు స్కూలుకు పోవాలె. మిమ్మల్నె వరు కానుతరని దరఖాస్తు చూసినప్పుడే అన్నడు. అయినా మహిళామండలి పెద్ద కదా ఆడోళ్ల గురించి ఆలోచించెటోళ్లు ఎవరూ లేకపోయిరి. సులోచన కూచున్నదన్న మాటేగని మనసు తిరుగుతా వున్నది. లక్ష్మి కండ్ల ముందట మెరిసినట్లయింది. ప్రసన్నంగ నవ్వు. తియ్యటి పిలుపు. 'అక్కా' అని ఎంతాప్యాయంగ పిలిచేది. మనసు నిండిపొయ్యే టిది. లోపటి నుంచి పిలుపు రాలేదు.

మరో జీపాగింది. ముగ్గురు లోపలికెళ్లింద్రు. వాళ్లను గేటు దగ్గర ఎవలూ ఆపరు. నమస్తె పెట్టి పంపిస్తరు. తమనే ఆగుమంటరు. పెద్దోల్లతో మాట్లాడుతున్న రంటరు. ఇంతింతసేపు మాట్లాడితె వొచ్చిన వాళ్ల పరిస్థితేం గావాలె. తిండీ తిప్పలు.

రాజమ్మ వెళ్లి పక్కింట్ల అడిగి నీళ్లు తాగొచ్చింది. గంట ముందే హోటల్ కెళ్లి అందరూ టీ తాగి వొచ్చింద్రు. మళ్లా దాహమయితంది. పిలుపు రాలే. ఎమ్మెల్యే ఏమంటడో తెలవది. మహిళామండలి వాళ్లంతా అడిగితె కాదనలేకపొయ్యింది. మొగమాట మెక్కువ తనకు. జన్మభూమి కింద స్కూలు ప్రహరీగోడ కాంట్రాక్టు కిప్పించుమని అడిగెతందుకొచ్చింది. ఆ కాంట్రాక్టు కోసం సర్పంస పోటీ పడుతుండు. ఎంపీటీసీ పోటీపడుతుండు.జడ్‌పిటిసీ రాజమ్మ భర్త మల్లేశం మ హిళామండలి వాళ్లను తయారు చేసి తోలుకొ చ్చిండు.

"ఏం సావో ఇది ఎండల. సావురాక, పని చెడే, పైస చెడె, పానం చెడె." వజ్రమ్మ ఆపుకోలేక బయటికి అన్నది. సులోచన పట్టించుకోలేదు. పైరవి ఇష్టం లేదని రానని చెపుదామనుకున్నది. ఎమ్మెల్యే దగ్గర తన మాట చెల్లుబాటయితదని అందరు ఎక్కిస్తుంటే పొంగిపోయింది.

స్కూలు ప్రహరీగోడ, అవును గోడ, రక్షణ కోసమా? పైసల కోసమా? జన్మభూమి ఏం ఒరగబెట్టినా పెట్టకపోయినా తెలుగుదేశం వాళ్లకు బాగనే వొరగబెట్టింది. సగం శ్రమదానమన్నరు. కానీ సగం పైసలు మిగిలిచ్చుకునుడే. అడిగెటెళ్లుండరు. దంద అయిపోయింది. ఎమ్మెల్కేకు దగ్గరి ఒక సర్పంచ్ ఇంటిని 'జన్మభూమి బిల్డింగ్' అనే అంటరట. డబ్బు మామూలుది కాదుగద– లేకపోతే తను ఎమ్మెల్యే ఇంటి ముందల గేటుకాద కూచునేదేంది? లక్ష్మి ప్రసన్నంగనే అయినా నవ్వినట్లయింది. సులోచన భర్త టీచర్. ఇంత వ్యవసాయం వుంది. డబ్బు కోసం కాకపోవచ్చు. మరెందుకొచ్చిందసలు. మహిళామండలి కోసమా? సాటి ఆడవాళ్లలో ప్రత్యేకత కోసమా? పేరు కోసం కాదా? లక్ష్మి మాట్లాడితే ఎంత ప్రేమ ఒలికేది? 'అక్కా' లక్ష్మి పిలుపు. తియ్యటి పిలుపు. సోయికి వచ్చి చూసింది.

"ఏమొ ఆలోచిస్తున్నవక్కా," రాజమ్మ పిలుపు.

"ఇంక టైంబడతదట. ఆర్‌డివో, ఇంజనీరు ఇంకెవరెవరో ఉన్నరట. ఆయనొచ్చి టిఫిన్ చేసి రమ్మన్నడు. అట్లే వొచ్చేటప్పుడు డాక్ర పైసలు బ్యాంకుల కట్టొత్తాం. పనైపోతది."

బస్టాండు వరకెళ్లి టిఫిన్ చేసి బ్యాంకుకు పోయి వచ్చింద్రు. కొంచెం నిమ్మలపడింది ప్రాణం. సందర్శకుల సంఖ్యేమీ తగ్గలేదు. కొన్ని కార్లు వెళుతున్నయి. కొన్ని వస్తున్నయి. పోలీసోళ్లు జోకులాపి తమ దిక్కు చూస్తున్నరు. బీదా బిక్కీ బిక్కుమంటున్నరు. ఫైళ్లు లోపలికి వెల్తున్నయి. తెల్ల చొక్కాలు పసుపు చొక్కాలు మామూలే. సులోచననెవరో పలకరించింద్రు. వొచ్చిన పని చెప్పుకుంట కొంచెం మాట్లాడింది. ఈలోపల లోపల్నించి పిలుపు. అం దర్నీ లోపలికి తీసుకెళ్లింద్రు. కుర్చీలల్ల కూచుం డబెట్టింద్రు.

హాల్లో చంద్రబాబు ఫోటో వుంది. పక్కన ఎమ్మెల్లే. అసంఖ్యాకంగ ప్రజలున్నరు. ఏదో పెద్ద సభ ఫోటో.

సులోచన మనసు మనసుల లేదు. లక్ష్మి నవ్వుతున్నది. నవ్వుతున్నట్లే ఉన్నది. చీకట్లో ఇద్దరూ కలిసి నడుస్తూ పడబోయింది. లక్ష్మి గట్టిగ పట్టుకున్నది. తన చీర ముళ్లకంపకు తట్టుకున్నది. తొవ్వ లేదు. అడ్డంపడి పోతున్నరు. లైటు వెలుగు చూసి తను ఉలిక్కిపడ్డది. రాత్రి దూరం నుంచి అట్లనే కనబడుతయని, రోడ్డు మీద పొయ్యే మోటరులైట్లని చెప్పి లక్ష్మి నవ్వింది. తాము పోంగనే గొంగడి పరిచి కూచోబెట్టింద్రు. కొత్త కొత్త విషయాలు చాల చెప్పింద్రు. తిరిగొచ్చెటప్పుడు లక్ష్మి వాళ్లను ఎన్నిసార్లు మెచ్చుకున్నదో? నిజానికి లక్ష్మి ఆ రాత్రి అక్కడ్నుంచి వొచ్చిందో ఉండిపోయిందో సులోచనకు అంతుబట్టలేదు.

తలపోటు మరింత పెరిగింది. రాజమ్మ ఎమ్మెల్లే ఎంత మంచోడో, బిల్డింగెంత బాగుందో వివరిస్తుంది.వాళ్లలో తనతో సహా ఐదారుగురికి ఆ వాతావరణం కొత్త. ఆ హాలుకు ఎడమవైపు మెట్లున్నయి పైకి. మెట్ల పక్కన మరో గదిలోకి ద్వారం. డోర్ కాస్టీగా వుంది. ప్లాస్టిక్ తోరణం వేళ్లాడుతుంది. పైన ఎమ్మెల్లే గెలిసినప్పటి ఊరేగింపు ఫోటో పెద్ద సైజులో ల్యామినేషన్ చేసి వున్నది.

ఇట్లాంటి చోటికొస్తే ఓపిక కావాలె. ఓపికంటె లక్ష్మిదే. భర్తకు సకులం చేసింది. అయినా ఏదోో వంకతో కొట్టెటోడు. ఎందుకు భరిస్తవు లక్ష్మీ అంటే నవ్వేది. తన చెవిలో ఏదో గుగుస పడుతున్నట్టు ఏదో యాదికొచ్చింది.

"ఏం సావో ఇది ఎండల. సావురాక, పని చెడే, పైస చెడె, పానం చెడె." వజ్రమ్మ ఆపుకోలేక బయటికి అన్నది. సులోచన పట్టించుకోలేదు. పైరవి ఇష్టం లేదని రానని చెపుదామనుకున్నది. ఎమ్మెల్యే దగ్గర తన మాట చెల్లుబాటయితదని అందరు ఎక్కిస్తుంటే పొంగిపోయింది"

లోపలి వాళ్లు బయటికెళ్లింద్రు. సులోచన వాళ్లను మరో హాల్లోకి తీసుకెళ్లింద్రు. ముప్పయిదాకా కుర్చీలున్నయి. కొందరు కూచోని వున్నరు. ఎదురు సీట్లో ఎమ్మెల్లే. సులోచన నమస్కరించింది. 'బాగున్నర' అని అడిగిండు. ఆరు సీట్లల్ల పదిమంది సర్దుకొని కూచున్నరు. పి.ఎ. వరుసగ చదువుతుండు. కొద్దిసేపు చుట్టూ చూసింది సులోచన. 'ఆదర్శ మహిళామండలి, రాఘవాపూర్'.

అందరూ లేచి నిల్చున్నరు.

ఎమ్మెల్యే విషయమడిగిండు.

"ఏం లేద్సార్, జన్మభూమి కింద మనిషికో పని ఇచ్చింద్రు గద. మా మహిళా మండలికిగా స్కూల్ గోడ ఇప్పించుండ్రి."

"సరే, మీ సర్పంచేడి?" సర్పంచ్ ఏదో ఆనబోయిండు.

"స్కూల్ గోడ వాళ్లు చేసుకుంటరు. నువ్వూకో. వాళ్లు అడుగక అడుగక ఆడిగిండ్రు. మన సి.ఎం. మహిళలు ముందటకి రావాలంటండు గదనయా. వాళ్లే చేసుకోని. ఆ.. యండివోగారు వాళ్లకు సాంక్షన్ ఇయ్యండ్రి."

సులోచన ఎంత సంతోషపడ్డదో చెప్పలేం. తన మాట చెల్లినందుకు మహా సంతోషపడ్డది. అందరూ నమస్తే చెప్పి వొచ్చేసిండ్రు. ఎమ్మెల్యే ఎంత మంచోడో ఈసారి సులోచన పొగడ్త మొదలుపెట్టింది.

×××

సిద్దిపేట నుంచి వొచ్చేసరికి రాత్రి పదిదాటింది. పిల్లలు ఆకల్తోని ఆవసోపాలు పడుతున్నరు.

"కొంచెం వండుకుంటె అయిపొయ్యేది గద."

''తమరి రాచకార్యానికి అదొకటి మేం చేసుకునేదుండె. ఉండాలె కొంచెం," ఆయన కొంచెం కోపంగ ఏదో అనబోయినా సులోచన ఏమీ పట్టించుకోకుండా వంటింట్లకు నడిచింది.

ఒంట్లె ఓపిక లేకపోయినా వంట చేసింది. టీవీ దగ్గర్నుంచి లేపి పిల్లలకూ ఆయనకూ తినబెట్టి పడకలు వేసింది. తిని అంట్లగిన్నెలు కడిగి పడుకునే సరికి అర్ధరాత్రి దాటింది. కాళ్లు గుంజుతున్నయి. నిద్ర వస్తలేదు. ఆల్సెమైతే నిద్రపట్టది. ఇదొగ చిక్కుపోయిన పని అయినందుకు సంతోషంగ ఉన్నది.

మహిళామండలి పెట్టినప్పుడు ఎంత సంతోషమన్పిచ్చిందో ఇయ్యాల్ల అంత సంతోషమ న్పించింది. ఆ రోజు లక్ష్మి తానూ సభలో హడావుడిగ తిరిగింద్రు. స్కూల్లో కూడా ఇద్దరు కలిసి తిరిగేది. ఎటుపొయ్యినా కలిసే. ఆఖర్కు ముత్రానికి పొయ్యినా కలిసే.ఇద్దరు జిగ్రీ దోస్తులు. సార్ల దృష్టిల వాళ్లిద్దరిది ప్రత్యేకమైన స్థానం. 'ప్రార్థన ప్రతిజ్ఞ' 'లక్ష్మీ సులోచన' తామే చెప్పేవాళ్లు. లక్ష్మికి నవ్వు మొకం. తను తొందరపడ్డా లక్ష్మి సర్దుకొచ్చేది. తెలివున్నా చదువుకోవాలని వున్నా మూడో తరగతిలో ఉండంగనే లక్ష్మి పెళ్లి చేశారు. విడిపొయ్యేటప్పుడు ఒకరి మీదొకరు పడి ఏడ్చి ఓదార్చుకున్నరు. సులోచన నాయిన కొంచెం రాజకీయాలల్ల తిరగటం వనల పక్కవూరికెళ్లి చదువుకొనే అవకాశం కలిగింది.

తొమ్మిదో తరగతిలో తెలుగుసారు పూర్ణమ్మ పాఠం చెప్పుతంటే ఏడుపొచ్చింది. ఏడ ముచ్చటొచ్చినా స్త్రీల పరిస్థితికి తల్లడిల్లేది. పూర్ణమ్మ పాట కంఠతా చేసి ఎన్నోసార్లు స్కూల్లో పాడింది. ప్రైజు తీసుకున్నది. పూర్ణమ్మ పాత్రలో లక్ష్మి కనిపించేది. కందుకూరి, గురజాడ, రాజారామ్మోహన్‌రాయ్‌ల గురించి చెప్పేటప్పుడు తనకు బాగా చదువుకోవాలనిపించేది. చదివినంత దూరం చదివిస్తానన్న నాయిన ఏడో తరగతిలోనే మాట తప్పిండు. ఏడుస్తున్నా వినలేదు. చనిపోతానని గొడవ చేసింది. పిల్లవాడు ఉద్యోగస్తుడిని, మంచి సంబంధమని ఒత్తిడి చేసి పెళ్లి జరిపించింద్రు. లక్ష్మి అత్తగారూరు రాఘవాపూర్‌కే తను వెళ్తున్నందుకు లోపల్లోపల కొత ఊరట పొందింది.

లక్ష్మికి తీరిక తక్కువ. ఎప్పుడూ ఏదో పని. పొద్దంతా బీడీలు చేసేది. భర్త రామచంద్రం తాగొచ్చి కొట్లాట పెట్టేవాడు. వారానికోసారి సులోచనకు కలుస్తది. కలిసినప్పుడు తన కష్టాలు చెప్పుకొని కన్నీళ్లు పెట్టుకొనేది. ముచ్చట పెట్టేది. ముచ్చట్లతో గంటలు గంటలు గడిచిపోయ్యేది.

ఆరోజు పిల్లలకు హెూంవర్క్ చేయించుతున్నది. చీకటి పడుతున్నది. ఆడోళ్లంత ఆగమాగం ఉరుకుతుండ్రు. కలకలం విని బయటికొచ్చింది. రామచంద్రం తాగొచ్చి లొల్లి పెడుతుందని తెలిసింది. సులోచన అట్లనే ఉరికింది. అందర్ని తిడుతూ గెదుముతున్నడు. లక్ష్మిని ఇంట్లేసి గొళ్లెం పెట్టిండు. కాలబెడ్తనని ఎగురుతున్నడు. సులోచన రామచంద్రం చేతిల గ్యాసునూరె డబ్బా గుంజేసింది. గొళ్లెం తీసింది. తనను లక్ష్మి గట్టిగ అలుముకున్నది. పావుగంట దాంక ఇడిచి పెట్టలేదు. తను వీపంత నిమిరి సముదాయించింది. ఆరోజు సులోచన ధైర్యాన్ని ఆడోళ్లు చాలా మంది మెచ్చుకున్నరు. ఒకరిద్దరు మగవాళ్లు కూడా సులోచనను తారిఫ్ చేసింద్రు. వారంరోజుల్లో 'ఆదర్శ మహిళామండలి' ఏర్పడ్డది. ఆడోళ్ల కండగ నిలబడి ఇద్దరు మొగోళ్లని పంచాయితికి గుంజేసరికి అందరికి జంకు పుట్టింది.

వరకట్న వేధింపులు, తాగొచ్చి వేధింపులు, అనుమానం కేసులు, అలుమగల పంచాయితులు చాల తెంపింద్రు. పది ఊర్లల్ల మహిలా మండలులు ఏర్పడ్డయి. అన్ని ఊర్ల మహిళలతో మహిళా దినోత్సవం నాడు పార్టీవాళ్లు పెద్ద ఎత్తున మీటింగ్ పెట్టింద్రు. స్త్రీల సమస్యల మీద రచయితలు, జర్నలిస్టులు చాలా విషయాలు చెప్పింద్రు. సులోచన, లక్ష్మి కలిసి స్కూలు రోజుల తర్వాత సభలో పాటలు పాడింద్రు.

నిండూ అమాసనాడు ఓలచ్చ గుమ్మడి
ఆడపిల్ల పుట్టినది ఓలచ్చ గుమ్మడి
వరిగింజ నోట్లె ఏసి ఓలచ్చ గుమ్మడి
గొంతు పిసికి చంపబోతె ఓలచ్చ గుమ్మడి
.. పులుకు పులుకున చూడవట్టె

అమ్మలక్కలందరు కంటతడి పెట్టుకున్నరు. సులోచన వొచ్చిన తర్వాత ఆడోళ్ల బతుకులే మారినయన్నరు. రెండుమూడు సార్లు పార్టీవాళ్లు తమ ఇద్దరితో కలిసి మాట్లాడింద్రు. లక్ష్మి పార్టీలోకి వెళ్లిన తర్వాత ఊర్లో చాలా సమస్యలొచ్చి పడ్డయి. పోలీసులు ఆడోళ్ల వెంటబడ్డరు. ఆయన ద్వారా ఎమ్మెల్యే పలుకుబడిని ఉపయోగించి తన పేరు తీసేయించుకునేసరికి తలప్రాణం పోయింది. మహిళామండలి మీద ముద్ర పొయ్యేతందుకు ఎమ్మెల్లేను ఆర్డీవోను పిలిచి ఊర్లె మీటింగ్ పెట్టించింది.

తన నిధుల్లోంచి బిల్డింగ్ కోసం యాభైవేలిచ్చిండు ఎమ్మెల్లే. మహిళామండలికి బిల్డింగయింది. చాలా సాధించినట్లయి గర్వంగ అన్పించింది. గ్రామంలో ఏది జరిగినా తనను పిలుస్తున్నరు. చాలా తృప్తి కలిగింది సులోచనకు.

'సీడ్స్' స్వచ్ఛంద సంస్థ మహిళాభివృద్ధి కార్యక్రమాలతో ఊరికొచ్చింది. మహిళల ఆర్థిక పరపతి గురించి, పొదుపు గురించి వివరించింది. ఆ యేడు మహిళా దినోత్సవం నాడు డివిజన్ స్థాయిలో ఐదువేల మంది మహిళలతో పెద్ద ఎత్తున సభ పెట్టింది. పట్నం నుంచి డైరెక్టర్లు, రచయిత్రులు వచ్చింద్రు. కుటుంబహింస, లైంగిక హింస గురించి రచయిత్రులు వివరిస్తుంటె సులోచనలో కొత్త చైతన్యం వికసించింది. కొత్త పాటలతో ఒక గాయకబృందం ఏర్పాటైంది.సులోచన ఆర్గనైజర్‌గా చేరింది. డైరెక్టర్ ఒక మహిళా కార్యకర్తతో ప్రవర్తించిన తీరు మహిళల్లో ప్రకంపనాలు సృష్టించినప్పటికీ తనేమి మాట్లాడలేకపోయింది. ఎక్కువ గొడవయితే ఉన్న కార్యక్రమాలు ఆగిపోయే పరిస్థితి కనబడింది. ఆరోజు ఇట్లాగే చాలా రాత్రి దనుక నిద్రపట్టలేదు.

మహిళల సమీకరణల మధ్య ప్రభుత్వం మహిళా జన్మభూమి ప్రకటించింది. మహిళా సాధికారత గురించి ముఖ్యమంత్రి ఉపన్యాసం టీవీలో చూసి ఆడోళ్లు చర్చించుకున్నరు. మల్లేశం చొరవ చేసిండు. సులోచన నేతృత్వంలో ద్వాక్రా గ్రూపు ప్రారంభమైంది. నెలనెలా సొమ్ము దాచుకునే పొదుపు పథకం చిట్టీ వేసుకునేందుకు దారితీసింది. ప్రభుత్వ సహాయం ప్రేరణతో ఆదర్శ మహిళా మండలి కొద్ది రోజుల్లోనే ఆరు ద్వాక్రా గ్రూపులై వాటి మధ్య పోటీ ప్రారంభమైంది. సులోచనకు మహిళల ఐక్యత దెబ్బ తిన్నందుకు బాధగా ఉన్నా తప్పలేదు.

ప్రపంచ పొదుపు దినోత్సవం నాడు సిద్దిపేటలో పెద్ద ఎత్తున మహిళార్యాలీ జరిగింది. సులోచన పాట చెప్పితే అందరూ చప్పట్లతో అలాపిస్తూ వీధులు తిరిగింద్రు.

నిండూ అమాసనాడు ఆడపిల్ల పుట్టినాది
ఆడపిల్ల పెళ్లి కొరకు ఓలచ్చ గుమ్మడి అర్థబ్యాద కూడవెట్టు
కాలురెక్క పడిపోతె ఓలచ్చ గుమ్మడి కాసులుంటె బతుకొచ్చు

సులోచన జీవితంలో మార్పులు పాటల్లో ప్రతిబింబించినయి.

ఎన్నికలొచ్చినయి. ఎమ్మెల్లే కోసం ఏజెంటుగ కూచుండి ఓట్లేయించింది సులోచన.

ఎడమపక్క నుంచి కుడిపక్కకు తిరిగి పడుకున్నది. అట్లయినా నిద్ర పట్టుత లేదు. నిద్ర పట్టక జ్ఞాపకాలో, జ్ఞాపకాలతో నిద్ర పడుతలేదో తెలుస్తలేదు.

ఎన్నిసార్లు యాజ్జేసుకున్నా లక్ష్మి కలుస్తలేదు. లక్ష్మి ఆశయం వెంబడి నడుస్తోంది. సులోచన కాలం వెంబడి నడుస్తోంది. మొత్తానికి బండి నడువాలె. కాలం గడిచిపోతున్నది. రాత్రి గడిచిపోతున్నది. నిద్ర వొస్తే బాగుండు. సులోచన పడక మీద ముండ్లు పరచినట్టు...

××

సులోచనతోనే కొబ్బరికాయ కొట్టించి పునాది పని మొదలుపెట్టింద్రు. సర్పంచ్‌తో సహా ఊళ్లో చాలామంది పెద్దలు అక్కడికొచ్చింద్రు. మహిళామండలి కాంట్రాక్టిని మరింత విశేషంగా చెప్పుకొన్నరు. కొందరైతే చాటుగా చెవులు కొరుక్కున్నరు. సుతారాయన కొలుచుకున్నడు. మల్లేశం, ఒకరిద్దరు ఏవేవి ఎన్నెన్ని కావాలో లెక్కలు చెప్పుతుంటే సులోచన పేపర్ మీద రాసింది. కైకిలోల్ల మగోళ్లు పునాది తవ్వుతుంటే ఆడోళ్లు తట్టతోని మట్టి ఎత్తుతుండ్రు. వేపచెట్టు కింద కూచోని సులోచన, రాజమ్మ పర్యవేక్షిస్తుండ్రు. లోపల సారేదో పాఠం చెపుతుండు. 'ఇల్లు, ఈగ' పిల్లలు గట్టిగ చెప్పుతండ్రు. బాష్పవాయు పీడనం గురించి వినబడుతుంటే సులోచన ప్రయత్నించి సార్ గొంతుతో లీనమవుతున్నది.

ట్రాక్టర్ ఆగింది. డ్రైవర్ లింగం దిగి, "సులోచనక్కా." అనుకుంట దగ్గరి కొచ్చిండు.

"రాత్రి ఎన్‌కౌంటర్‌లో లక్ష్మక్క చనిపోయిందట. సిద్దిపేటలో పోస్టుమార్టం చేసింద్రట. హాస్పిటల్ ముందట ఏడు శవాలు వరుసగ పడుకోబెట్టింద్రట. వాళ్ల మనుషులొస్తే శవాలిస్తరట. బాయి దగ్గరికి పోయి చెప్పిన. అక్క అత్తగారొల్లు ఎవరు పట్టించుకునెటట్టూ లేరు. వెంకటాపూర్‌కు కూడా చెప్పి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1110 వ రోజు **'నాట్యం'** అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'సమర్థుడు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

నాట్యరీతులు

గీతం సంగీతం అభినయం
లలిత కళల మేలు కలయిక నాట్యం
నాట్యంలో నవరస ప్రదర్శనలు
విభిన్నరకాల నాట్యరీతులు జగమంతా
భరతనాట్యం
ప్రతిబింబించె భారతీయ సంస్కృతి
కూచిపూడి నాట్యరీతి
తెలుగు నేలన
భామాకలాపంలో
సత్యభామ సంరంభం
భిన్నరకాల మేలుకలయికగా
ఆంధ్రనాట్యం
ఒడిస్సీ మణిపురి కథక్
మరెన్నో నాట్యరీతులు
పేరిణీ నృత్యరీతి
కాకతీయుల ప్రేరణ
రీతి ఏదైతేనేం
తనువులోని
అణువణువు కదలునేమో
మనసును మైమరపించే నాట్యం
నాట్యభంగిమలన్నీ
నటరాజ స్వరూపమే
పాశ్చాత్య నాట్యం ప్రదర్శితం
లోకమంతా
మన వారసత్వం
మన సాంస్కృతిక స్వరూపం నాట్యం
అరంగేట్రం చేసేవారెందరో
నాట్యానికి అంకితమెందరో.
- లక్ష్మారెడ్డి పసుల

నృత్యం

శరీర లయబద్ధ విన్యాసం
సంగీత లయబద్ధ గమనం
మన దేశ సంస్కృతి తెలిపే నాట్యం
భారతీయ కళల్లో మకుటాయమానం
భరతముని బోధించెనిట
తోలి నాట్యశాస్త్రం
కాయానికి కమనీయ
వ్యాయామం నాట్యం.
భిన్న నాట్యకళలకు నిలయమీ దేశం
నాట్యం రెండు భాగాలుగా వర్గీకరణం
సంప్రదాయం, జానపదం
నవ విధ సంప్రదాయ నాట్యం
కథక్, కథకళి, కూచిపూడి,
భరత నాట్యం
యక్షగానం, మణిపురి, ఒడిస్సీ,
మోహిని అట్టం, సత్రియ నృత్యం
ప్రతి నాట్యం దేనికదే భిన్నం.
నెలత నయనానందకర వస్త్ర ధారణం
ముదిత ముగ్ధ మనోహర అలంకరణం
విశాల కనుద్వయం పలికించే
హావభావం
నాట్యానికి అదనపు సోయగం
జానపద నాట్యాలలో
ప్రసిద్ధం దాండియా, కోలాటం
భిన్న సంస్కృతుల మేళవింపు
భారతీయ నాట్యం
విదేశాలు సైతం మెచ్చే నాట్య విన్యాసం
-జె.వి.కుమార్ చేపూరి

నయనానందం

ఆంగికం భువనం యస్య.
వాచికం స వాఙ్మయం
ఆహార్యం చంద్ర తారాది
తం వందే సాత్వికం శివం!!.
మూల విరాట్ శివుడు
తాండవం సర్వ శ్రేష్ఠం
జగద్ హితం
సంతోషం
భావ రూప తాళయుక్తం.
నాటకం మూలం జగతికి
నటన అభినయం
వాచకం
భావ వ్యక్తీకరణం
మాటలో మిళితం
ఆంగికం అందం.
నాట్యం రాగ తాళయుక్త
సంగీత భావవల్లరి
ముఖ చంద్రికా రూపాన
వ్యక్తీకరణం అంగాంగ విన్యాసం.
ప్రతి ప్రాణి తిలకించే
ఆనంద నిలయ హృదయం
ఆలయంలో తొలి ప్రదర్శన.
రాజుల ఆదరణ రమణీయం
పదిమందికి సంతోషం
పారమార్థికం
పుణ్యం
భరతముని భావం భాష్యం.
పరమశివుడు ప్రతి హృదయంలో
పరవశించి వరవళ్లు తొక్కే నాట్యం
నయనానందకరం
మహదానందం
ఎన్నెన్నో నాట్యాలు
కూచిపూడి
భరతనాట్యం
కథాకళి
రకరకాలు ఆవిర్భవించి
రంగస్థలాన్ని ప్రభవింపజేసి
పేరుతెచ్చాయి దేశానికి.
-కె.కె.తాయారు

సత్యం శివం సుందరం

అరవైనాలుగు కళల్లో ముఖ్యం
రాగ భావ తాళ సమ్మేళనం
సంస్కృతీ సంస్కారాల శిఖరం
నటరాజ ప్రచండ తాండవం
భావోద్రేకాల సరూప సదృశం
సత్యం శివం సుందరం మన నృత్యం.
మనుగడ పర్యావరణాల సంధానం
వినోద విజ్ఞానాత్మక వికాసం
శాస్త్రీయమైనా
జానపదమైనా
ప్రాంతీయమైనా
వినూత్నమైనా
జీవన మానసిక ఉల్లాసం.
బహు మునిపుంగవుల పరిశోధనం
శారీరక, మానసిక సంచిత వ్యాయామం
భారతీయ నృత్యం
పాశ్చత్యులకు కూడా సమ్మోహనం
సత్యమైనది
నిత్యం ఉన్నది
ఈ నృత్యం మనది.
యుగయుగాల సంప్రదాయం
తరతరాలు అవలంబించి ఆనందించే
ఉత్తమ కళారాధన మన నృత్యం
సత్యం శివం సుందరం మన నృత్యం.
-రాజప్ప

భారతీయ విశిష్టత

నాట్య సృష్టికర్త భరతముని
అదొక శాస్త్రీయ కళ
భారతదేశ విశిష్ట కళ
దేశ గౌరవం ఇనుమడించే కళ
సరిహద్దులు దాటి
విదేశాల్లో ప్రాచుర్యం.
ఇతర శాస్త్రీయ
నృత్య కళలకి మూలం
లయబద్ధ సంగీతం
లయబద్ధ శారీరక విన్యాసాలు
నయనాభినయం.
స్పష్టంగా భావ వ్యక్తీకరణం
నాట్యం ప్రత్యేకత
కళల కాణాచి భారతదేశం
ఒక్కో రాష్ట్రానికో ప్రత్యేక కళ
తెలుగు కూచిపూడి
మలయాళం కథక్
ఒరియా ఒడిస్సి
భాష ఏదైనా
భావ మొక్కటే
కళ ఏదైనా
మనోరంజకమే.
-మోటూరి శాంత కుమారి

భారతీయ కళ

భారతదేశం
కళలకు పుట్టినిల్లు
భరత ముని చెప్పిన కళ
నాట్య శాస్త్రం
శరీరానికి చక్కని వ్యాయామం
ప్రతి నృత్యం దేనికదే సాటి
ప్రాంతాల సంస్కృతి ఆధారం
నాట్య ఆవిర్భావం.
దేశంలో
భిన్నజాతులు
భిన్నసంస్కృతులు
భిన్న భాషలు
బహు సంస్కృతుల సంగమం
భారతదేశం
ప్రతిఫలించే నృత్య రీతులు
నాట్య భంగిమలు
కట్టు బొట్టు సంగీతపు తీరు
అన్నీ
ఆయా సంస్కృతులను బట్టి
రాణించే నాట్యాలు
నటరాజ నృత్యం
శివతాండవం
అన్నీ మన పురాణాల్లో
మనకు తెలుసున్న
దైవాంశ నాట్యాలు.
-ఆర్. రమాదేవి

సంగీత కళానిధి

సంగీత కళానిధితో పాటే
నాట్యం ఒక గొప్ప కళ.
సంస్కృతీ సంప్రదాయాలకు
నాట్యం అపురూపం
జానపద నాట్యాలు
దేశానికి గర్వకారణం
నాట్యం
ఆరోగ్యానికి శుభ సూచకం
స్వర్గంలో రంభ ఊర్వశి
నాట్యం ప్రసిద్ధి.
పురి విప్పిన నెమలి నాట్యం
ప్రకృతి సౌందర్యం
నాట్యంలో నయనం ప్రధానం
ముఖ కవళికలతో రసమయం.
-రజనీ కులకర్ణి

అద్భుత కళ

సూర్యోదయ కిరణాల మాదిరి
నాట్య కళ విశ్వవిఖ్యాతం
ఆహార్యంలో ఎన్నో అంశాలు
ముఖంలో భావాలు అవసరం
పదాలకి అనుగుణంగా
జతుల విన్యాసాలు చూపుతూ
ఆద్యంతం కళా ప్రదర్శన
కావాలి దీనికి
నిరంతర సాధన
శోధన
పరిశోధన
వేష ధారణలో
ఎప్పటి కప్పుడు
ఆ కీర్తనలు
అనుగుణంగా ఉండి
మంచి సాధన ఉండాలి
బాల గోపాల తరంగం
ఆహార్యం వేరు
పళ్ళెం, చేతుల్లో జ్యోతులు
శిరస్సుపై పాపిడి
పక్కకి పెట్టే చెంబులో నీళ్లతో
నాట్యం అత్యంత అద్భుతం
అలనాటి తరంగం
నేటికీ అత్యంత కొత్త ధనమే
నారాయణ తీర్థ తరంగాలు
నాట్యానికి అత్యంత ప్రసిద్ధి
ఎన్నో నాట్య రూపకాలు
నేటికీ ఎంతో ప్రాధాన్యం.
-నారుమంచి వాణీ ప్రభాకరి

గురువు నేర్పని విద్య

హావభావాల మేళవింపు
అంగాంగాల విన్యాసాలు
కనేవారికి ఇంపైన కనులవిందు.
సంగీతానికి నృత్యానికీ సంబంధం
ముక్కుకూ శ్వాసకు ఉన్న అనుబంధం
పసిపాపలు కూడా సంగీతానికి
కాళ్ళు కదపకపోరు
ప్రాంతాల వారిగా
ఎన్నో నృత్యరీతులు
ప్రాచీనం నుండీ నేటివరకూ
వన్నెలద్దిన నాట్యాలు.
శాస్త్రీయ, జానపద,
పాశ్చాత్య రీతులెన్నో
ఇలా నాలో ఉన్న కవిగా
ఎన్నింటినో విడమర్చి వీలున్నా
మరి కవి లేని నేనే అయితే
బహుపరాక్
ఇంట్లో శబ్దం వినిపిస్తోంది
అసంబద్ధంగా నా కాళ్ళలో
కదలిక ప్రారంభం
ఏనాట్యరీతులకూ అందనిదీ
ఏప్రాంతవాసులైనా చేసేది
ఏ గురువు లేనిది
ప్రత్యేకించీ ఎవరికీ చూపనిది
లోపలి శబ్దాలకు అనుగుణంగా
కథాకళీ,కథక్
నృత్య రీతులను మించేవి.
బాల్యంలో
ఏ నృత్య రీతులు నేర్వకున్నా
అన్నీ అనుకోకుండా
శరీరంలో మిళితమైనవి
సందర్భోచితంగా బయటపడి
శరీరాన్ని రక్షించేవి
ఒక్కోప్పుడు తప్పుడు గెంతులకు
సరిగమల విన్యాసాలు చూడక
తప్పనివి
ఏదేమైనా
ఏ నృత్యమో తెలియకున్నా
హావభావాలను అందంగా పలికిస్తూనే
బయటి వారికి నాట్యం నేర్పే
గురువుగా నటించాల్సిందే
ఎదుటి మిత్రుడు కూడా అలాంటి
గురువనే తృప్తి పడాల్సిందే.
-గుర్రాల వేంకటేశ్వర్లు

సునందామృతం

జలతుంబికా న్యాయము

జలము అంటే నీరు.తుంబికము అంటే గుజ్జు తీసి ఎండబెట్టిన సొరకాయ బుర్ర.దీనికి ఒక తంత్రి జోడించి తంబురగా,వాయిద్యాలలో ఒకటిగా ఉపయోగించడం చూస్తుంటాం.

ఆ ఖాళీగా ఉన్న సొరకాయ బుర్రను మట్టితో నింపి నీళ్ళలో వదిలితే మునిగి పోతుంది. అందులోని మట్టి అంతా నీటిలో కరిగిపోయిన తరవాత ఆ సొరకాయ బుర్ర పైకి తేలుతుంది.

దీనిని మనిషికి వర్తింప జేసి చెప్పడం విశేషం. ప్రాణం ఉన్నప్పుడు నీళ్ళలో పడితే ఈత రాక మునిగి మనిషి పోతాడు.అదే మనిషి మరణిం చిన తరువాత పైకి తేలుతాడు. ఆధ్యాత్మిక దృష్టితో పరిశీ లిస్తే ఈ జల తుంబికా న్యాయ ము మార్మికతతో చెప్పిన సత్యం.

ఏ వ్యక్తి అయినా దేహ సంబంధం ఉన్నంత వరకు అంటే దేహంలో ప్రాణం ఉన్నంత కాలం అనేకానేక ఐహిక సమస్యల్లో మునిగి పోతాడనీ.దేహ బంధం నశించిన అంటే ప్రాణం అనంత వాయువుల్లో కలిసిన తర్వాత ఇంకా ఆరాట పోరాటాలు ఏమీ ఉండవని, భవ బంధాలు తెంచుకుని ఈ ప్రపంచంతో సంబంధం లేకుండా సొరకాయ బుర్రలా పైకి తేలిపోతాడనే అర్థంతో ఈ న్యాయమును ఉదాహరణగా చెబుతుంటారు.

ఈ ప్రపంచంలో జీవించే వ్యక్తుల మనసుల్లో అరిషడ్వర్గాలు, వ్యామోహాలు, తాపత్రయాలు అనేవి నిండిపోయి అనేక రకాల ప్రవర్తనలు గల వ్యక్తులుగా రూపొందడానికి దోహదమవుతున్నాయి.ఈ విధంగా మనుషులు మాయా మోహాల్లో చిక్కుకుని పోతున్నారు.కానీ జీవితంలో ఏది శాశ్వతం,ఏది అశాశ్వతమో గ్రహించడం లేదు.అది గ్రహించేలా సహజ కవి పోతన భాగవతంలో బలి చక్రవర్తి నోట పలికించిన ఈ పద్యాన్ని చూద్దాం.

కారే రాజులు రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిన్ బొందరే?వా/రీ? సిరి మూట కట్టుకొని పోవంజాలిరే? భూమిపై పేరైనం గలదే?శిబి ప్రముఖులున్ ప్రీతిన్ యశఃకాములై/ ఈరే కోర్కెలు? వారలన్ మరచిరే ఇక్కాలమున్ భార్గవా!'

ఎందరో రాజులయ్యారు.వాళ్ళకు రాజ్యాలు కలిగాయి.అందువల్ల వారికి గర్వం పెరిగింది కానీ ఏరీ వారు? ఆ తర్వాత ఏం జరిగింది.వారెవరూ సంపదలో సూది మొనంత కూడా మోసుకు పోలేదు కదా! కనీసానికి వాళ్ళ పేర్లు భూమ్మీద నిలిచాయా? లేదు కదా! మరి శిబి చక్రవర్తి లాంటి దాతలు ఎంతో ఇష్టంగా కీర్తి కోసం కోర్కెలు తీర్చారు. అలా చేయడం వల్ల వారి పేర్లు నేటికీ నిలిచాయి.వారిని మరిచి పోకుండా నేటికీ తలుచుకుంటున్నాం కదా! అని భావం.

కాబట్టి వ్యక్తులుగా స్వార్థంతో బతికినా, నిస్వార్థంగా సమాజ హితైషిగా జీవించినా ఈ దేహం ఉన్నంత వరకే. అందరి ప్రాణాలు పంచభూతాల్లో కలవాల్సిందే అన్న సత్యాన్ని గ్రహించాలి.

మరణించాక సొరకాయ బుర్రలా తేలిపోయి నీటి ప్రవాహంలో ఎటో కొట్టుకుపోయినా మన ఆనవాళ్లతో, మనదైన ఔన్నత్యంతో ఈ భూమ్మీద శాశ్వతంగా ఉండాలంటే మంచి పనులు చేయాలి.మానవీయులుగా ప్రవర్తించాలి.

ఈ జల తుంబికా న్యాయము యొక్క పరమార్థం, అంతరార్థం ఇదే.

-పురిమళ్ల సునంద
9441815722

విశ్వకర్మల వైభవం!

శతాధిక గ్రంథకర్త, బహుముఖ ప్రజ్ఞలను సొంతం చేసుకున్న పరిశోధక పంచానన.. వేదాంత విశారద గురు శిరోమణి డా॥ కపిలవాయి లింగ మూర్తిగారి కలం నుండి జాలువారిన అరుదైన, అపురూప గ్రంథం "నమః కవి పంచాన నాయ" విశ్వకర్మల వైభవాన్ని చాటి చెప్పేలా ఉంది. శతకాలు, సంకీర్తనలు, ఉదాహరణలు, వచన గేయ పద్యకృతులు, కావ్యాలు, ఆధ్యాత్మికాలు, చరిత్రలు, వచన రచనలు- నవలలు, కథా సాహిత్యం- సంకలనాలు- వ్యాఖ్యానాలు- వ్యాస సంపుటాలు, జీవిత చిరిత్రలు- నాటకాలు.. నిఘంటువులు- పీఠిక లు- అనువాదాలు- పరిష్కృత రచ నలు- సంచికలు- సంపాదకీయాలు- ఇలా ఎన్నో రచనలు చేసిన డా॥ కపిలవాయిగారు తమ అపార మేధో సంపత్తిని పది మందికి పంచేలా గ్రంథాలను వెలువరించి.. సాహితీ లోకాన్ని సుసంపన్నం చేశారు. అంతేగాక దాదాపు పది పుస్తకాలు డాక్టర్ కపిలవాయిగారిపై రావడం విశేషం.. డా॥ కపిలవాయి లింగ మూర్తి సాహిత్య కళాపీఠం నాగర్ కర్నూల్‌లో ఏర్పాటు చేసి.. పురస్కా రాలు యివ్వడమే గాక.. ప్రచురణలు.. పుస్తకావిష్కరణలు.. జాతీయ సదస్సులు.. గ్రంథ వితరణలు లాంటివి నిర్వహించి సాహితీ ప్రియులకే కాక సమాజానికి చేరువైనారు. భావి తరాలకు కావలసినంత సాహిత్య భాండాగారాన్ని ప్రోది చేసి పెట్టిన ఘనత లింగమూర్తిగారికే ఉంది.

వారి రచనలను.. లింగ మూర్తి గారి అనుభవ, పరిశోధనాసారాన్ని ఇప్పటి తరానికే కాకుండా భావి తరాల వారికి ఓ వారసత్వత సంపదగా అందించడంలో.. ఆయన కుమారుడు కపిలవాయి అశోక్ బాబుగారు మరింత వెలుగులోకి తేవడానికి కృషి చేయడం అభినందనీయం. విశ్వకర్మలపై లింగ మూర్తి గారు విశ్వకర్మలపై రాసిన పద్యాలు.. కవితల సంకలనం- అప్పుడప్పు డు సభల్లో షష్టిపూర్తి వంటి ప్రత్యేక కార్యక్రమాల్లో లింగమూర్తిగారు అందించిన రచనలు ఏర్చికూర్చి "నమః కవి పంచాన నాయ" పేరుతో కపిల వాయి అశోక్ బాబుగారు సామాజిక బాధ్యతతో ఓ గ్రంథాన్ని సాహితీ లోకానికి అందించారు. పైన పేర్కొన్న అంశాలతో పాటు విశ్వ బ్రాహ్మణ కవులు, బంధువులు, ఆప్తులు, సన్నిహి తులపై ఇతర కవులు వ్రాసిన పద్యాలను ఇందులో అనుబంధంగా చేర్చా రు. ఈ పుస్తక ప్రచురణలో డా॥ లాలుకోట వెంకటచారిగారు తమ ఔదార్యాన్ని ప్రకటించడం ప్రశంసనీ యం.

విశ్వకర్మ, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి, ఈశ్వరాంబ, శిల్పిబ్రహ్మ, కవి సింహ కాశీపతి, శ్రీ రామదుగు గురు బ్రహ్మేంద్రస్వాములు వంటి ప్ర ముఖులపై లింగమూర్తిగారి రచనలు ఆ లో చ నా త్మ క ం గా నూ.. పరిశోధనాత్మ కంగాను అందరు అనుసరించేలా కొలువుదీరాయి.

వంగోలు ఆదిశేషశాస్త్రి, కె.వి. చలపతిరావు, రావూరు భరద్వాజ, పెదపాటి నాగేశ్వరరావు, చింతపట్ల మురహరి, బొడ్డుపల్లి నరసింహాచార్య వివాహ స్వర్ణోత్సవ సద్దళి, కూరెళ్ల విఠలాచార్యులు, ఎర్రోజు లక్ష్మణాచారి, బైరోజు దామోదరాచార్యులు, రామదాసు కృష్ణాచార్యులు, నేరెళ్ళ గురుచరణం, పసునూరు బ్రహ్మానందాచారి, మారోజు ప్రకాశరావు, కాకుమాను రంగయ్య, గుండోజు యాదగిరి, కె.సి. కాశప్ప, డా॥ అమరవాది ప్రభాకరాచారి తదితరులకు ఆత్మీయంగా లింగమూర్తిగారు రాసిన రచనలు బాగున్నాయి. ఇలా.. వివాహాలు.. వినోదాలకు, వీడ్కోలులకు కవిగా స్నేహ పూర్వకంగా, ఆప్యాయంగా లింగమూర్తిగారు పంపిన శుభాభినందన సందేశాలు ఆయన ఉత్తమ వ్యక్తిత్వాన్ని ప్రతిఫలిం పజేసేలా ఉన్నాయి. ఇవి లింగమూర్తి గారి సంస్కారానికి, అద్దం పట్టేలా ఉన్నాయి. విశ్వకర్మ వైభవాన్ని చాటే విధంగా, గ్రంథాన్ని తీర్చిదిద్దిన లింగమూర్తిగారికి వందనాలు తెలియ జేద్దాం- ఇప్పుడు ఆయన లేకున్నా ఆయన ప్రకటించిన భావాలు భావి తరాలకు మార్గదర్శకంగా ఉండే విధంగా ఈ గ్రంథంలో కొలువుదీ రాయి. ఇంత మంచి గ్రంథాన్ని అంది చిన అశోక్‌బాబు కపిలవాయి గారికి అందుకు సహకరించిన డా॥ లాలు కోట వెంకటాచారిగారికి అభినందనలు తెలుపుదాం.

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544



ప్రతులకు:కపిలవాయి అశోక్‌బాబు
ఫ్లాట్ నెం.404-సి బ్లాక్
వైదేహి నివాస్ గోల్డెన్ పాల్మ్
అచ్యుతరెడ్డి మార్గ్, విద్యానగర్
హైదరాబాద్-500 044.
సెల్: 87907 27772

పుస్తక సమీక్షలు

'గోపాలకృష్ణ అద్భుత 'గో'సర్వస్వ మహా గ్రంథం- 'గో'మాత-శక్తి'

భారత్ భాషాభూషణ్ డా॥ నిట్టల గోపాలకృష్ణ గోమాత సేవాట్రస్ట్ ప్రచురణగా గోవిజ్ఞాన సర్వస్వాన్ని 'గోమాత-అద్భుత శక్తి' ఉద్గ్రంథంగా వెలువరించారు. వేదాలు, ఉపనిషత్తులు, అష్టాదశ పురాణాలు, ఇతిహాసాలు, వివిధ ఆధ్యాత్మిక శాస్త్రాల నుండి 'గోమాత' గురించి సేకరించిన సర్వస్వం ఈ గ్రంథంలో పొందుపరచడం డా॥ నిట్టల గోపాలకృష్ణ సాధించిన అనితర సాధ్యమైన అద్భుత రచనా మహత్యం అనడంలో సందేహం లేదు. గోమాత-వేదాలు, ప్రమాణ గ్రంథాలు, ఋషులు, సంపద, సూక్తులు, కథలు, పూజ, వందనం అన్నదాత తొమ్మిది అధ్యాయాలుగా ఈ గ్రంథంలో పరిశోధనాత్మక ప్రజ్ఞ, వేదాధ్యయన పాండితీ ప్రకర్షతో డా॥ గోపాలకృష్ణ, అనన్య సామాన్యమైన ప్రతిభ, దీక్షా తత్పరత స్పష్టమవుతోంది. చతుర్వేదాల క్రమానుసరణగా, ప్రాచీన మహత్త్వ సంపన్నత, ఋషులు, మహర్షుల, పురాణాల క్రమానుసరణగా శ్లోకాల తాత్పర్య సహితంగా వివరించారు. గ్రంథ నిర్మాణకర్త డా॥ లక్ష్మణరేఖ గోపాలకృష్ణగారు తెలుగు చలనచిత్ర రంగంలో సుప్రసిద్ధులు. సామాజిక సేవారంగంలో సినీరంగానికీ కాక, వివిధ చారిత్రక మహనీయుల జీవిత చరిత్రలు, డాక్యుమెంటరీల నందీ అవార్డుల గ్రహితగా ముప్పైకి పైగా వివిధ గ్రంథాల రచయితగా గోమాత సేవాట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షునిగా అవిరళ సేవలందిస్తున్న 'గో భక్తి తత్పర ఆధ్యాత్మిక విశిష్టులైన' సాక్షాత్కరింపచేసారు. కేవలం ప్రాచీన ఆధ్యాత్మిక విశిష్టతతో సరిపెట్టుకోకుండా రచయిత ఆధునిక సాహిత్య గో-మాతా ఔన్నత్యమే కాకుండా సామాజిక శ్రేయోదాయకంగా, వ్యవసాయ ఆహార రంగాలలో అమృ తతుల్యమైన గోప్రాశస్త్యాన్ని, సర్వజనా వళికి మేలుకొలుపుగా అందించారు. తెలుగు సాహిత్యలోకంలో ఈ గోమాత- అద్భుతశక్తి అరుదైన గ్రంథంగా ఆరాధ్యనీయం. గోజ్ఞాన, విజ్ఞాన సర్వస్వంగా ఋషిపరంపర ప్రసాదించిన పవిత్ర యజ్ఞ దీక్షా సమన్వితంగానె కాకుండా ఆరోగ్య రక్షణ, కాలుష్య నివారణకు గోసంరక్షణ ఆవశ్యకతను శాస్త్ర, సాంకేతిక ఆధారాలతో ఈ గ్రంథం వైతాళిక బాధ్యత నిర్వర్తిస్తోంది. చక్కని తేటతెలుగు భాషా వైదుష్యంతో సరళంగా హృద్యంగా చదువరులను ఆలోచింపచేస్తుంది. గోపూజ, 116 గోమాత కథలు, శ్రీమద్రామాయణ, మహా భాగవత, మహాభారతాది పవిత్ర సాహిత్యంలోని గో ప్రస్తావ నలు గో అష్టోత్తర శతనామావళి, దండకాలు, పారాయణాలు ఎన్నో ముఖ్యాంశాలు, అద్భుతాలు చదువరు లను విస్మయ పరుస్తాయి. లోకాల సందర్శనం, ప్రమాణ గ్రంథాల సాక్షీభూతంగా 'గావో విశ్వస్య మా తరః'గా, హిందూ ధర్మః ఆధ్యాత్మిక శక్తి సంపన్నవంతమైన గోమాత అద్భుతశక్తి విశ్వరూప దర్శనం చేయించిన డా॥ నిట్టల గోపాలకృష్ణ పూర్వజన్మ సుకృతం కారణంగా ఈ గ్రంథం ఆవిర్భవించింది. భగవద్గీత, తత్సమానంగా ప్రతీ ఇంటా ఆరాధనీయంగా వుండవలసిన మహా గ్రంథం యిది.



ప్రతులకు: డా॥ నిట్టల గోపాలకృష్ణ
గోమాత సేవా ట్రస్ట్, 202
శివసాయి సదన్, శ్రీనివాసపురం
రామాంతపూర్,
హైదరాబాద్-500 013.
సెల్: 94930 53206.

-జయసూర్య
సెల్:9014948336

-డా. రావి రంగారావు
9247581825

"అమరావతి సాహితీమిత్రులు" సంస్థ అధ్యక్షులు డా॥ రావి రంగారావు ఫేస్బుక్ గ్రూప్ లో నిర్వహిస్తున్న "వారం వారం మినీ కవితల పోటీ"లలో ఎంపికైన మినీ కవితలు...

అధికారం

అధికారం "అమ్మ" అయితే
అమ్మ ప్రేమ అందరికీ!
అధికారం "అమ్మకానిది"...
"అమ్మ"కానిది అయితే,
కొన్నవారి ప్రేమ కొందరికే!!
-కొండ్రెడ్డి నాగిరెడ్డి

పంచిపెట్టడానికి
పంచుకోవటానికి...
అక్కున చేర్చుకోవడానికి
అణగ తొక్క టానికి..
శాసించడానికి
పాలించడానికి...
అన్నిటికీ ఒకటే మంత్రధండం.!
మనసున్న వాడికి ఇస్తావో?
మాంత్రికుడికి ఇస్తావో..?
-శివకుమార్ ఎనికేపల్లి

కాళ్ళు పట్టుకుంది
వీపునెక్కించుకుని
ముద్దాడింది..
చీదరించుకోకున్నా
చీమిడి ముక్కు తుడిసింది
అధికారం అందగానే
కుర్చీకి
కొమ్ములొచ్చి కుమ్మింది
-నేలపూరి రత్నాజీ

చట్ట సభలో
న్యాయ కిరీటాన్ని
ధరించి
ధర్మ సింహాసనాన్ని
అధిష్టించిన
'అధికారం' వెలిగిపోతుంది!
ఆహా నా కల
నిజమైతే
ఎంత బాగుండో!!
-ధనుంజయరెడ్డి

అధికారం
అమ్మ చెంతన
ప్రేమదండం,
నాన్న చేతిలో
చుక్కాని...
అహంకరిస్తే
నిప్పుల కొలిమి,
అభిమానిస్తే
చంద్రుని చల్లన...
-శింగరాజు శ్రీనివాసరావు

వెలుగులు పంచే
అద్భుత దీపం..
సమర్థుడి చేతికిస్తే
నలుదిక్కులా వెలుగులు,
అసమర్థుడి కిస్తే
ఆ దీపానికే పగుళ్లు!
-వసుధ

మదగజం
ప్రతిపక్షం లేని
అధికారం
మావటి లేని మదగజం!
అందరినీ
తొక్కిపారేస్తుంది!
-జయంతి లక్ష్మీ నరసింహం

ఇప్పు డదొక
అసత్యబీరం!
అధములకు
అందలాలు,
అర్హులకు
బంధనాలు.
-బొల్లినేని నాగార్జునసాగర్

అధి(అహం)కారం

అధికారం...
చెట్టుకు పూత అయితే
ఫలాలను ఇస్తుంది...
గట్టును గాయపరుస్తూ ప్రవహిస్తే
ఊళ్లను ముంచుతుంది,
ఉప్పు నీటి పాలవుతుంది.
-పాణిరావు యర్రగుంట్ల

ఆటవికత
జనాల మధ్యకు
వచ్చిం దేమిటో
ఖాకీ
ఖద్దరు దుస్తులు ధరించి!
-అన్నాప్రగడ

ఆరంభంలో ఆర్భాటం
అంతంలో పోరాటం...
నిజాయితీకి తీర్పు
నిలుపుకొనే నేర్పు
లేకుంటే మార్పు
-సూర్యదేవర రవికుమార్

అధికారం
అంగడి సరుకు!
ఒకడు అమ్ముకుంటుంటే
మరొకడు కుమ్ముకుంటున్నాడు!
ఇచ్చిన వాడు మాత్రం
ఇంకా అమాయకంగా
నమ్ముకుంటూనే ఉన్నాడు!
-సాధనాల

చీకటిని నరికితే
సంస్కరణ,
వెలుతురును కొడుతుంటే
సంహరణ!
జాగ్రత్త,
అధికారం గొడ్డలితో!
-మాధవి మేళ్లచెరువు

అధికారం
కులం నుడికారం,
ధనం గుణకారం,
చీకటి సహకారం,
ప్రజాస్వామ్యం ఇప్పుడు
హాహాకారం!
-శ్రీరామదాసు అమరనాథ్

అధికారానికి చెట్టు తల్లి
ఆదర్శం కావాలి,
విత్తనాల రూపంలో
సేవను వెదజల్లాలి!
-నంద్యాల లక్ష్మారెడ్డి

ప్రేమాధికారం

శ్రమించే రైతుదే అధికారం,
పండించే ప్రకృతిదే అధికారం,
బోధించే
గురువుదే అధికారం...
వీడెవడురా బాబూ,
డబ్బు పెట్టి
అధికారం కొంటా నంటాడు!
-మెట్టు శ్రీనివాసరెడ్డి

అమావాస్యలో
వెలుతురు నిచ్చే
మంత్రదండం కావాలి!
విద్వేషాల
విషనాగులకు
నాగస్వరం కావాలి!
-లయన్ కాకరపర్తి సుబ్రహ్మణ్యం

అధికారం
చాల శక్తి బాణం,
నేర్పుగా సంధిస్తే
నీదే విజయం,
దుర్వినియోగం చేస్తే
నీ మీదికే ప్రయోగం!
-అమ్మాజీ గోపాలుని

అధికారం
మా గొంతు నొక్కుతున్నా
మాకు హాయిగానే ఉంది!
మేం ప్రస్తుతం
ఉచితాల మత్తులో పడివున్నాం!
-మేడిశెట్టి యోగేశ్వరరావు

"శ్రమ"

శ్రమతో సాధిస్తే
ఫలితం "పసిడి"
అది లేకుంటే
జీవితం "చప్పిడి"
దోపిడీ చేస్తే
పడుతుంది "పిడి"!
-గోలి

శ్రమ నీది
పరిశ్రమ వారిది...
రెక్కలు నీవి
చెక్కులు వారివి...
జీవన సౌందర్యం నీది
దోచిన సంపద వారిది...
-సదాశివన్

అతడు శ్రామికుడు
కూనిరాగాలతో
గుండె వీణపై
శ్రమైక గీతాలు పలికించే
శ్రమ జీవన సౌందర్య కాముకుడు!
-కాయల నాగేంద్ర

అమ్మ ప్రేగు...
తండ్రి భుజం...
వెలకట్టలేని
శ్రమ గోపురాలు...
అనుసరిస్తే అభ్యుదయం...
ఆదరిస్తే దైవ సమానం...
-శింగరాజు శ్రీనివాసరావు

శ్రమలో పుట్టిన
చెమట బొట్టే
పంట పొలాలకు
ప్రాణ వాయువు!
-కాయల నాగేంద్ర

ప్రగతి మూలం
మృగం నుంచి
మనిషిగ మార్చింది శ్రమ,
రాతి యుగం నుంచి
రోదసి యానానికి నిను
మరల్చింది శ్రమ.
-బొల్లినేని నాగార్జున సాగర్

ఏమో....
దోచుకుంటున్నారని
దాచుకోకు....
శ్రమిస్తూనే ఉండు..
ఏమో ఎవరికి తెలుసు
రేపు నువ్వే రాజు కావచ్చు..
రాజ్య మేలవచ్చు..
-మేడిశెట్టి యోగేశ్వరరావు

జీవి జననం శ్రమ,
జీవి గమనం శ్రమ,
జీవి మరణం శ్రమ
శ్రమజీవిగా బతుకు
,శ్రమ కామివై వెతుకు నీ గమ్యం
**-కానుకొలను సుబ్రహ్మణ్యేశ్వర

ఆ అడవి నిశ్శబ్దంగా పూస్తున్న పూతలో ఔషధ గుణాలున్నాయి

-మహాకవి డా॥ కత్తి పద్మారావు
9849741695

సూర్యుడు భగభగా మండుతున్నాడు
అరకులోయలో భూమి పొగలుగ్రక్కుతుంది
చుక్క నీరు దొరకక
ఖాళీ బిందెల మోత
పడునుదేరిన ఆ కత్తి మొన మీద
నియంత పాదం మోపాడు
రాజ్యం రాబందు అయింది
పక్షుల గుంపులన్నీ చెల్లాచెదురయ్యాయి
ఉగ్ర నరసింహుడిని పూలతో అలంకరించారు
ఆ అవతారం ఎవర్నో చీలుస్తుంది
పాలసముద్రం పొంగుతున్నమోత
వధ శృతిబద్ధంగా జరుగుతుంది
వృద్ధాశ్రమంలో ఆ తల్లి కన్నీటి కథలు విని
భూమి బద్దలు అవుతుంది
రోడ్డు మీద కరగడానికి తారు కూడా లేదు
గులకరాళ్లే నిప్పు కణికలవుతున్నాయి
కొడుకు తాగొచ్చి తల్లినే చెంప దెబ్బ వేస్తున్నాడు
రాజ్యం బానిసల్ని సృష్టిస్తుంది
వారి నిశ్వాసకు నదులు ఎండిపోతున్నాయి
ఆ ప్రవక్త అహింసను బోధించాడు
ఆయన పేర తలలు తెగుతున్నాయి.
మనుషులు దేనికి బానిసలు అవుతున్నారు ?
తమ స్వరం తామే విని
మురిసిపోతున్నారా?
జ్ఞాన శూన్యులు అయ్యే కొలదీ
వారిలో అహం పెరుగుతుంది
రూపాయి కాగితాల మీద నడుస్తూ
మనిషిని కోల్పోతున్నారు
విరుపు మాటలతో
గుండె తలుపులు మూసుకుంటున్నారు
స్వీయ కీర్తి కోసం
రంగుల వలయాలు సృష్టించుకుంటున్నారు
తమకు తాము బరువయ్యాక
స్వీయ జీవనం వ్యధాభరితమవుతుంది
ఇంకిపోయిన నది
ఒడ్డున ఎండు చేపల్లా
జీవితం దుర్గంధమౌతుంది
అనిద్రులు, అసంకల్పితులు
నిశ్చర్యులు ఎక్కువౌతున్నారు
ఆ అడవి నిశ్శబ్దంగా
పూస్తున్న పూతలో
ఔషధ గుణాలున్నాయి
ఆ వనితలు
సంకెళ్లు తెగ్గొట్టిన వారిని మరిచిపోయారు
సంకెళ్లు వేసిన వారిని పూజిస్తున్నారు
వాస్తవాన్ని విస్మరించి
కథల ఒడిలో, బడిలో
తల వాల్చుతున్నారు.
వారు ధ్యానంలో ఉన్నారా?
కోరికల వలయాల్లో విహరిస్తున్నారా?
ప్రేరణ శక్తులే వారికి రణశక్తులవుతున్నాయా?
పరిసరాలను అధిగమించి
వారు ఉష్ణ పక్షుల్లా
ఇసుక మేటల్లో తల దూర్చుతున్నారా ?
భ్రమ పూరిత జీవితం
అభద్రతను హరిస్తుంది కదూ!
ఆ చిత్రకారుడు శతాబ్దాల నాడు
ఒక చిత్రం గీశాడు
ఆ చిత్రంలోని కాంత కళ్ళు
ఇంకా మెరుస్తున్నాయి
కనురెప్పలు సొగసులీనుతున్నాయి
అది రంగుల చిత్రం కాదు
పెన్సిల్ తో గీసిన చిత్రం
దానికి ఆ చిత్రకారుడు జీవం పోశాడు
ఆ చిత్రం
అతని ప్రేమ తరంగాల నుంచి ఉద్భవించింది
రంగుల బొమ్మలెన్నో
మాసి పోతున్నాయి
ఆ రూపం మాత్రం అలాగే
ప్రభాసిస్తుంది
ఎవరీమె?
సహజంగానే సౌందర్యవతి
ఎందుకు రంగులు పులుముకుంది?
ఆత్మ న్యూనతా?
అభద్రతా?. అనివార్యతా?
నిజానికి ఆ ముఖాన ఆ రంగులే కనిపిస్తున్నాయి
ఆమె రూపం
దృశ్యమానమవ్వడం లేదు
ఆమె గొంతు శ్రావ్య మైనదే
ఎందుకు పడేపదే గీర పోతుంది?
దాన్ని నిరంతరం శృతిబద్ధం చేయటం లేదా?
ఆడంబరాలతో సహజ ప్రకృతిలన్నీ
అంతరిస్తున్నాయి సుమా!
నిజమే! ఆ భవంతిలో
గ్రంథాలయం లేదు
చిత్రపటాలు లేవు
మృదువైన సంభాషణ లేదు
అనునయమూ లేదు
ఒక్క మొక్క మొలవడం లేదు
ఆత్మీయత లేని దగ్గర
ఆత్మ న్యూనతేగా పెరిగేది
వారి అభివ్యక్తిలో శ్రావ్యత తగ్గుతుంది.
వారెందుకు ప్రతిదానికీ అరుస్తున్నారు?
వారేదో అసంతృప్తిలో ఉన్నారా?
వారేమీ కలిగి ఉన్నారో వారికి తెలియదు కదూ!
నిజానికి వినేవారు తగ్గుతున్నారు
ఎవరు బోధకులు?
ఎవరు శ్రోతలు?
అంతా చర్విత చరణం అయితే
జ్ఞానానికి చోటేది?
అందుకే ఆ చిత్తు కాగితాల మీద
ఆ జ్ఞాని గీసిన నాలుగు గీతలు
ఈ దేశ భవిష్యత్తుకు పునాది రాళ్లు
నిస్వార్థం నుండి ప్రభవించిన వాక్కులవి
అవే మన జీవితానికి సోపానాలు
ఆ మెట్లు ఎక్కుదాం.

పుస్తక సమీక్ష

వందేళ్ల వచన కవిత్వ దర్పణం

వందేళ్ల తెలుగు కవిత్వాన్ని ఒడిసి పట్టిన ఉద్గ్రంథం కవన గర్భరాలు. ఆధునిక కవిత్వంలో విశేషమైన కృషి చేసిన నూరు మంది కవులు రాసిన కొన్ని కవితలను తీసుకొని, వాటిమీద విశ్లేషణలు రాశారు. ఈ వంద మంది కవులలో శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, పుట్టపర్తి నారాయణాచార్యులు, దాశరథి, తిలక్, సినారె, శేషేంద్ర, కుందుర్తి వంటి అగ్రేసర కవులు చాలామంది ఉన్నారు. వారితో పాటు ఎన్. గోపి, కె. శివారెడ్డి, నగ్నముని, ఓల్గా, ఘంటశాల నిర్మల, సందిని సిధారెడ్డి, కందుకూరి శ్రీరాములు, అమ్మంగి వేణుగోపాల్ వంటి కవులు ఉన్నారు. వీరితోపాటు నేటితరం కవులైన మౌనశ్రీ మల్లిక్, కోడూరి విజయ్ కుమార్, షాజహాన, తగుళ్ల గోపాల్ వంటి కవులకు కూడా ఇందులో స్థానం కల్పించడం సంపాదకుల సౌహార్ద్ర హృదయానికి నిదర్శనం.

ఇందులో కవితలతో పాటు కవుల సంక్షిప్త జీవిత విశేషాలను, వారి ఫోటోలను కూడా సేకరించి ప్రచురించారు. అలాగే కవులపై, గేయాలపై వివిధ కవుల అభిప్రాయాలు కూడా ఇందులోని ప్రత్యేక ఆకర్షణలు.



ప్రతులకు: వి.కె. ప్రేమ్‌చంద్, 102, బి- బ్లాక్, శ్రీనిలయ ఏషియన్ మ్యానర్, రోడ్ నెంబర్ 2, బంజరాహిల్స్, హైదరాబాద్- 500034. మొబైల్: 9848052486

వీటితోపాటు ప్రపంచంలోని ప్రసిద్ధ కవుల అనువాద కవితలు, జానపద గేయాలు, చమత్కార కవితలు, మినీ కవితల విభాగాలు ఇందులో ఉన్నాయి.

కొన్ని నూతన కవితా ప్రక్రియలు పేరుతో నానీలు, రెక్కలు, మణిపూసలు, మొగ్గలు, సప్తపది, మొగ్గలు, రవ్వలు వంటి మినీ కవితా రూపాలను పొందుపరిచారు.

అలాగే భారతదేశంలోని వివిధ పురస్కారాలు పొందిన కవుల జాబితాలకు చోటు కల్పించారు. అవార్డుల నేపథ్యం కూడా ఇవ్వడం పాఠకులకు మంచి సమాచారం.

తెలుగులో ఇప్పటివరకు, ఆధునిక వచన కవిత్వం మీద ఇంతటి బృహత్తర గ్రంథం రాలేదని చెప్పొచ్చు.

ఈ పుస్తకం ప్రియులకు, పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తుంది.

ఎంతో శ్రమకోర్చి ఈ పుస్తకాన్ని పాఠకులకు చేరువచేసిన చేవూరు సుబ్బారావు, వి.కె. ప్రేమ్ చంద్ కృషి అభినందనీయం.

-మౌనశ్రీ మల్లిక్
8919338546

ఏ సమస్యలున్న అధికారుల దృష్టికి తేవాలి- మంత్రి పొన్నం..

హైదరాబాద్, ఏప్రిల్ 3:ఏ సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలకు తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్. బుధవారం ఉదయం కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో పొన్నం మార్నింగ్ వాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడున్న ప్రజలతో మాట్లాడారు.

ఈ సంవత్సరం వర్షాలు పడకపోవడంతో కరువు ఏర్పడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని వాటికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చాడు. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు రాకుండా పాత బావులు, కొత్త బోర్లను వేయమని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రజా సమస్యలను తీర్చడానికి ప్రభుత్వం ఎల్లవేళల కృషి చేస్తుందని చెప్పాడు.

స్కైలా గేటెడ్ కమ్యూనిటీ సీనియర్ సిటీజెన్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

హైదరాబాద్, ఏప్రిల్ 3:రోజురోజుకు మండిపోతున్న ఎండల కారణంగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. స్కైలా గేటెడ్ కమ్యూనిటీ సీనియర్ సిటీజెన్స్ ఆధ్వర్యంలో పుప్పాల గూడలోని స్కైలా గెట్ ముందు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. వేసవి కాలంలో ప్రజలు ఎండ తీవ్రతకు పడుతున్న ఇబ్బందిని గమనించి ఈచలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రం ద్వారా ప్రజలకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు గురవ రాజు తెలిపారు.

గిరిజనుల సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్, బీజేపీలు- కేతావత్ యాదగిరి

నిజామాబాద్, ఏప్రిల్ 3:గిరిజనుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన బీఆర్ఎస్, బీజేపీలకు గిరిజనులు బుద్ధి చెప్పాలని, ఈ నెల 7న నిజామాబాద్ లో నిర్వహించే గిరిజన బంజారా సమావేశానికి గిరిజన ఆదివాసీ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు, జిల్లా ఆదివాసీ గిరిజన అధ్యక్షులు కేతావత్ యాదగిరి కోరారు.

బుధవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేతావత్ యాదగిరి మాట్లాడుతూ.. ఏప్రిల్ 7న నిజామాబాద్ జిల్లా కేంద్రాలలోనీ బృందావన్ గార్డెన్ లో నిజామాబాద్ జిల్లా పార్లమెంట్ ఎన్నిక నేపథ్యంలో జిల్లా ఆది వాసీ గిరిజన సమావేశం ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఈరవత్రి అనిల్, అన్వేష్ రెడ్డి ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తహెర్ బిన్ హందాన్, మానాల మోహన్ రెడ్డితో పాటు బంజారా రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు హాజరుకానున్నారన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చామో అదే విధంగా లోక్ సభ ఎన్నికల్లో జీవన్ రెడ్డికి మద్దతు ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించుంకుంటామని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా నలుమూలల నుంచి, తండాల నుంచి ప్రతి ఒక్క గిరిజనలు హాజరు కావాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఉన్న ఆదివాసీలు, లంబాడా సోదరులు అందరూ పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర స్థాయి బంజారా సేవ సంఘం కార్య నిర్వాహక అధ్యక్షులు, రాంపూర్ పి ఎ సీ ఎస్ చైర్మన్ తారచంద్ మాట్లాడుతూ.. గిరిజన ఆదివాసీ అధ్యర్యంలో ఐదు నియోజక వర్గాల పరిధిలో అదివాసి గిరిజన సమావేశానికి విచ్చేసి మన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి మద్దతు తెలపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆదివాసి గిరిజనులు పెద్ద ఎత్తున హాజరై బంజరుల ఐక్యతను చాటాలన్నారు. బీజేపీ బీఆర్ఎస్ ఎన్నడూ కూడా బంజారాల సమస్యలపై పోరాడలేదని, ఏ ఒక్క తండాకు వెళ్లి మన బాధలు, గాథలు వినలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తే మన సమస్యలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షులు సుభాష్ జాదవ్, మల్కాపూర్ మాజీ సర్పంచ్ ప్రకాష్ నాయక్, రాజు, ఆదివాసీ వైస్ చైర్మన్ బాల్ రాజు నాయక్, ధర్పల్లి మండల అధ్యక్షుడు మంగ్య నాయక్, రూరల్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సురేష్ నాయక్, మోపాల్ మండల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు రవీందర్, వినోద్, దాదు రావు పాల్గొన్నారు.

పాలమూరు జిల్లా కవులకు, కళాకారులకు ఉగాది పురస్కారాలు

హైదరాబాద్, ఏప్రిల్ 3 (నేటి నిజం ప్రతినిధి): కురుమూర్తి దేవస్థానం ఆధ్వర్యంలో బెల్లం సత్యమ్మ ట్రస్టు నిర్వహణలో మార్చి 31 న చిన్నచింత కుంట మండలం కురుమూర్తిలో ఉమ్మడి పాలమూరు జిల్లా కవులకు, కళాకారులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యాయవాది వి.మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కవులను,కళాకారులను గుర్తించి కురుమూర్తి దేవస్థానం వారు ఉగాది పురస్కారాలను అందజేయడం అభినందనీయమన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎంతోమంది కవులు, కళాకారులు ఉన్నారని వారిని ప్రోత్సహించే విధంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం బెల్లం సాయిలు గొప్పదనమని ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన దేవస్థానం ముఖ్య కార్యనిర్వహణాధికారి మదనేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని కవులను, కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఉగాది పురస్కారాలను ప్రతి సంవత్సరం ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం రూపకర్త ప్రముఖ నటులు ప్రముఖ నటులు బెల్లం సాయిలు మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయస్థాయిలో పేరెన్నికగన్న కవులను, కళాకారులను గుర్తించి వారికి ప్రతి సంవత్సరం ఉగాది పురస్కారాలను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. సాహిత్యరంగంలో డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, కె. వీణారెడ్డి, కే. లక్ష్మణ్ గౌడ్, డాక్టర్ వెల్దండ వెంకటేశ్వరరావు, టి. అంబుజ, బండారు సునీత, బోల యాదయ్య, చిత్రకళా రంగంలో జమాల్ పూర్ మహేష్, హరికథగానంలో పద్మాల యాచార్య, నాటకరంగంలో వి. పాండురంగాచారి, కొల్లాపూర్ వెంకటేష్, ఆమని కృష్ణ, అచ్చంపేట వెంకటేష్ తదితరులను మెమెంటో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. వీరితో పాటుగా వివిధ సామాజిక విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి సామాజిక సేవారంగ అవార్డులను బహకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో సునీల్ కుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బండారు సునీతకు కురుమూర్తి దేవస్థానం వారి ఉగాది పురస్కారం

శ్రీ శ్రీ శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం వారి ఆధ్వర్యంలో ఆదివారం నాడు దేవస్థానం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆత్మకూరు బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు, కవయిత్రి బండారు సునీత బెల్లం సత్యమ్మ స్మారక ట్రస్టు ఉగాది సాహితీ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. విద్యారంగంలోనే కాకుండా సాహితీ సేవా రంగంలో కూడా రాణిస్తూ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న బండారు సునీతను నిర్వాహకులు శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయురాలిగా గుణాత్మక విద్యను అందిస్తూ పాలమూరు కవన వేదిక సంస్థ ద్వారా అనేక సాహితీ కార్యక్రమాలను నిర్వహిస్తూ తన కవితల ద్వారా సమాజాన్ని మేల్కొల్పుతున్న బండారు సునీత యువతరానికి మార్గదర్శకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షులు మనోహర్ రెడ్డి , నిర్వాహకులు బెల్లం సాయిలు, లుంబినీ లక్ష్మణ్ గౌడ్, శ్రీకాంత్ కవులు ,కళాకారులు పాల్గొన్నారు.

సమాజంపై బలమైనముద్ర వేసేవి కవితలు,పాటలు మాత్రమే..

-పెద్దపల్లి జిల్లా అదనపు పాలనాధికారి జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్

హైదరాబాద్, ఏప్రిల్ 3 (నేటి నిజం ప్రతినిధి):కవులు , గాయకుల పాత్ర సమాజంపై ఎంతో ఉందని, బలమైన ముద్ర వేసేది కవితలు పాటలేనని పెద్దపల్లి జిల్లా అదనపు పాలనాధికారి జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. మార్చి 31, ఆదివారం రోజున కరీంనగర్ జిల్లా లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథి, ఆవిష్కర్తగా జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ పాల్గొన్నారు. హుజురాబాద్ ప్రాజెక్ట్ అంగన్వాడి పర్యవేక్షకురాలు శ్రీమతి కోరుకంటి (మెన్నేని) కిరణ్మయి రచించిన నీ రాక కోసం పుస్తకాన్ని జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ ఆవిష్కరిస్తూ జిల్లాలో సాహితీ రంగాన్ని పరిపుష్టం చేస్తూ కవులు ఎన్నో పుస్తకాలు వెలువరిస్తున్నారని ఇది శుభపరిణామమని అన్నారు. విభిన్నమైన పూలను కలిపే దారంలాంటిది సాహిత్యమని అందరినీ కలుపుకుంటూ ముందుకు సాగుతుందని అన్నారు.విశిష్ట అతిథిగా పాల్గొన్న కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన అంకితం కథల సంకలనాన్ని ఆవిష్కరిస్తూ కీర్తిశిఖరమైన సి.నారాయణ రెడ్డి జన్మించిన ఈ నేలలో, పారుతున్న ఆ మానేరులో ఏదో మహాత్మ్యం ఉంది, అందుకే కరీంనగర్ కవులకు నిలయమైంది, ఎన్నో పుస్తకాల ఆవిష్కరణ సభలకు వేదికైందని అన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన జిల్లా సంక్షేమ శాఖ అధికారి (యఫ్.ఎ.సి) యం. సరస్వతి మాట్లాడుతూ ఐసిడిఎస్ ప్రాజెక్టులో కవిత్వం రాస్తున్న వారి సంఖ్య తక్కువని, కిరణ్మయి నీ రాక కోసం కవితా సంపుటిని వెలువరించి కవయిత్రిగా తన స్థానాన్ని నిలుపుకుం దని,ఆమె మరిన్ని పుస్తకాలు వెలువరించాలని ఆశిస్తూ అభినం దించారు.గౌరవ అతిథిగా విచ్చేసిన అమృత లత జీవన సాఫల్య పురస్కార గ్రహీత దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ కిరణ్మయి భావ కవిత్వానికి పెద్దపీట వేశారని, చక్కని పదబంధాలతో కవితలను పొందుపరి చారని పేర్కొన్నారు. మరొక గౌరవ అతిథి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత మాడిశెట్టి గోపాల్ మాట్లాడుతూ చిన్న పుస్తకమైనా మంచి భావ కవితలతో పచ్చిన నీ రాక కోసం పుస్తకాన్ని వెలువరించిన కిరణ్మయిని అభినందించారు. ప్రముఖ గాయకుడు ఉపాధ్యాయుడు కాసు మహేందర్ రాజు ఆహ్వానం పలకగా కవయిత్రి ఉపాధ్యాయిని మెరుగు అనూరాధ పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమ ంలో గాజోజు నాగభూషణం, బొమ్మకంటి కిషన్,గంప ఉమాపతి, యోగాచార్య సంపత్ కుమార్ , నగునూరి రాజన్న ఇటిక్యాల రాము, దామరకుంట శంకరయ్య, తడిగొప్పుల కుమార స్వామి,ఐల్నేని కేశవరావు, విజయలక్ష్మి ,కోరుకంటి ప్రభావతి, ఉమేశ్వరరావు, భాస్కరరావు , సింగిరెడ్డి రాజిరెడ్డి,పెనుగొండ సరసిజ,బ సవేశ్వర్,పత్తేం వసంత, సిరిపురం వాణిశ్రీ,వడ్డేపల్లి సంధ్య,నారోజు వెంకటరమణ , టి.వెంకట రమణ ,అంగన్వాడి ఉద్యోగులు మరియు గాయత్రి ఎన్ఆర్ఆర్ అపార్ట్మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

సాహితీ అవార్డులు-2023 ఎంట్రీలకు ఈశ్వరగారి ముక్తేశ్వరి ఫౌండేషన్ ఆహ్వానం

ఈశ్వరగారి ముక్తేశ్వరి ఫౌండేషన్ సాహితీ అవార్డులు-2023కుగాను తెలుగు సాహిత్యంలో ఈ క్రింది విభాగాలకు ఎంట్రీలను తేది. 30 ఏప్రిల్ 2024లోగా పంపించాలని ఫౌండేషన్ చైర్మన్ శ్రీ ఈశ్వరగారి నరహరి శర్మ విజ్ఞప్తి చేస్తున్నారు.

నిబంధనలు: తెలుగు భాషలో వారి వారి రచనలు 2021 నుండి 2023 మధ్య కాలంలో ప్రచురించినవిగా ఉండాలి.

- కథా సంపుటి విభాగం, వ్యాస సంపుటి విభాగం, ఆధ్యాత్మిక గ్రంథాలు అని మూడు విభాగాలలో ఎంపిక చేసిన ఒక్కొక్కరికి రూ. 10,116/- (పదివేల నూట పదహార్లు) నగదు అవార్డు, జ్ఞాపికతో సత్కరించబడుతారు. ఒక్కో అవార్డుకు 3 ప్రతులకు పంపించాలి.
- అవార్డుల ప్రధానం ఈశ్వరగారి ముక్తేశ్వరి ఫౌండేషన్ వారి కార్యాలయం, వేములవాడ (రాజన్న సిరిసిల్లా జిల్లా)లో జరుగుతుంది. అవార్డు గ్రహితలు వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుంది.
- విజేతల వివరాలు అవార్డు ప్రధానం తేది వగైరా తర్వాత ప్రకటించబడుతుంది.
- అవార్డుల ప్రధానం విషయంలో ఫౌండేషన్ వారిదే తుది నిర్ణయం. ఎట్టి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.

అవార్డులకై ఎంట్రీలు పంపాల్సిన చిరునామా:

ఈశ్వరగారి నరహరి శర్మ, చైర్మన్, ఈశ్వరగారి ముక్తేశ్వరి ఫౌండేషన్, జరహర్‌లాల్ నెహ్రూ విద్యాసంస్థల క్యాంపస్, పాతమార్కెట్ వద్ద, వేములవాడ-505 302. రాజన్న సిరిసిల్లా జిల్లా. టి.ఎస్. సెల్: 9896648880

వివేక వాణి



నాదినుండి రాజు నాయకుడే కాదు
మంత్రులెవరు లెక్క మనకు గాదు
ఆదినుండి మనకు నా ఋషులే ప్రభుల్
వినుడి స్వామి సద్వివేక వాణి !!

The leaders of our societies have never been either generals or kings but Rishis.

-బండిరాజుల శంకర్
సెల్: 99480 50608

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న 'బుధవారం బాద్షా'

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

పోటీ ఫలితాలు

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

సంకల్ప బలం

నా మేదోమథనపు నిధి గదుల్లో !
నేను పదిలంగా దాచుకున్నా!.
రేయి పవళ్లు రాసులు పోసుక
హాయిగ స్వప్నవీధిలో విహరిస్తూ
కృషి పట్టుదలతో ఎంతెంతో ఎదగాలని
ప్రఖ్యాతి రవళింపుతో రాణించాలని .
క్షణ క్షణం పోగేసినా జల్లు
ఆలోచన సులోచనాల విరిజల్లు
బంగారు భవిత రహదారిలో
సదా పదిలంగా పయనించాలని.
ద్యాసా దీక్ష కూడి గూడేసిన పొదరిల్లు
ప్రేమ ఆశల గువ్వల హరివిల్లు
చల్లని కిల కిలల రవములు
మక్కువల ఆ ఆశల జల జలలు.
చక్కగా వలవేసిన చిక్కని కల
సంశయాల సమన్వయమా!
మరి నాలో సాధనా లోపమా?
అది ఆశనిపాతమై నన్నెక్కిరించినీది.

-విజయ కుమారి
9100634635

వలపుల వల

వలపుల వలలో చిక్కితే
బయట పడుట కష్టమే
నీ కలలకు వలపుల వల
వేసినపుడు పడిపోతావు ప్రేమలో.
ఎంతటి వారలైనా కానీ
ప్రేమకు దాసోహం అంటారు
ప్రేమ అనే వలలోన చిక్కియే
ప్రేమ మైకంలో పడిపోతారు.
ప్రేమ పిచ్చి తలకు ఎక్కితే
ఆ పిచ్చి తగ్గదిక ఎన్నటికీ
ఆ ప్రేమే నిజమైనదే ఐతేను
ఇరు జీవితాలను కలుపుతుంది.
కామాతురాణాం న లజ్జ అని
పెద్దవాళ్ళు చెపుతుంటారు
కోరిక కలిగినపుడు అది ఎంతకైనా
తెగిస్తుంది అని అంటుంటారు.
ప్రేమ వలలో చిక్కిన ప్రేమ జంటలు
కలసి మెలసి కాపురములు
చేసినచో ఆనందాలు విరియు
కలతలే వచ్చిన నరకమే మిగులును.
ప్రేమికులు పెద్దల అనుమతి
పొందుట ఎంతో అవసరము
ఇరు వైపుల పెద్దల ఆమోదము
పొందితే కలుగును ఆనందము

-అక్కి నర్సింలు గౌడ్
రంగారెడ్డి జిల్లా

వల వేసిన కల

పరుగు తీస్తున్న కాలం
మార్పుకు దిశను చూపుతు
దశ మార్చుకునే ఆశను
తట్టిలేపే కలను వలవేసి పట్టి
మట్టికరిపిస్తున్న ఆదిపత్యం
కన్నీల వరదలో
మునిగిపోయేల చేస్తున్నది.
పుల్ల పుల్ల ఏరుకొచ్చి
మెల్ల మెల్లగా అల్లుకున్న గూడు
తెల్లారేసరికి చెదోరిపోయి
పరాయిపాలైతే తల్లడిల్లే మనసు
అల్లుకున్న కలల దీపం
మసకబారి పోతుంటే
వెలుగులేని వెతల బతుకులు
వేధనతో గూడులేని పక్షులై
ఎగరలేక ఎదుర్కునే శక్తి కై
ఎదురు చూస్తున్నది.
ఎడారిలో మొక్కలా
చినుకుకై ఎదురుచూస్తుంటే
దశ మార్చుకొని మరోదిశనుండి
రాలిన చినుకులు తడిచేస్తుంటే
చిగురించిన కొమ్మకు
ఆశల పూలు నవ్వుతు
పరిమళిస్తుంటే కలల మాల
భవిష్యత్తుకు బాట చూపుచున్నది.

-డా.బి.సుధాకర్, సిద్దిపేట

చిక్కించుకుని వెక్కిరిస్తుంది

కలలు మహా చెడ్డవి
అడ్డూ అదుపూ లేవు వాటికి
కనురెప్పల తలుపులను
తోసుకొచ్చేసి కలల వరదల్లో
ముంచేస్తాయి.
ఇలలో తీరని కోరికలు
మదిని నిదురబుచ్చి
కలలో కోలాటమాడుతుంటాయి
ఆశల కొలనులో ఈదులాడుతూ
మీనుల వంటి కనులను
వలలు వేసి కోరికల గాలానికి
మనసుని చిక్కించుకుని
ఊహల లోకంలో ఊరేగించి
కలల లోకమంతా తిప్పించి
మురిపించి
మెలకువ రప్పించి మంచంపై నుంచి
పడదోసి వెక్కిరిస్తాయి.

-కొలచన విజయ భారతి
హైదరాబాద్

నేటినిజం సభ్యత రుసుము

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపుకుని **5** సం॥రాలకు రూ. **700/-**లు.
10 సం॥రాలకు రూ **1200/-**లు.
పత్రిక కావాలనుకున్నవారు సభ్యత రుసుమును 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ./ చెక్ ద్వారా ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.
నేటినిజం' దినపత్రిక,
ఎస్ఆర్‌టి-169, జవహర్‌నగర్,
హైదరాబాద్-500 020.

కిన్నెర ఆర్ట్ థియేటర్స్
కిన్నెర కల్చరల్ & ఎడ్యుకేషనల్ ట్రస్ట్
బుధవారం 10, ఏప్రిల్ 2024, సా॥ 5-30 గంటలకు
రవీంద్రభారతి, హైదరాబాద్
కిన్నెర-శ్రీ క్రోధి నామ ఉగాది పురస్కారాలు
మరియు
పద్మశ్రీ పురస్కారాలు స్వీకరించబోతున్న